Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 242 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 సెప్టెంబర్ 2023 గురువారం పేజీలు : 4

## ఒక్కసారిగా పెరిగిన బంగారం, వెండి ధరలు..

బంగారం, వెండి ధరలు ఇవాళ ఊపందుకున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గడమో లేదంటే స్థిరంగానో ఉంటూ వచ్చిన బంగారం, వెండి ధరలు నేడు పరుగు ఆరంభించాయి. మరి ఈ పరుగు అనేది ఇవాల్టి వరకేనో.. కొద్ది రోజుల పాటు కొనసాగుతుందో చూడాలి. మొత్తానికి బంగారం, వెండి కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. అసలు నేటి పెరుగుదలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం అయితే లేదు.. ఆ స్థాయిలో పెరిగిందేమీ లేదు కానీ ఒకసారి పెరిగిందంటే.. దాదాపు కొన్ని రోజుల పాటు రోజువారీగా పెరుగుతూనే ఉంటుంది కాబట్టి కాస్త భయపడాల్సిన విషయమే. నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.100 పెరిగి రూ.54,250గా ఉంది. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.100 పెరిగి రూ.59,160కి చేరుకుంది. ఇక వెండి ధర విషయానికి వస్తే.. కిలోపై రూ.800 పెరిగి రూ.73 వేలకు చేరుకుంది.




# ఎన్నికల షెడ్యూల్‌కు రంగం సిద్ధం

**డిసెంబరు తొలివారంలో పోలింగ్**
**వచ్చే నెల 3 నుంచి ఈసీ బృందం పర్యటన**
**వీరి నివేదిక ఆధారంగా ఈసీఐ నిర్ణయం**
**ఓటర్ల జాబితాపై అభ్యంతరాల ప్రక్రియ పూర్తి**
**అక్టోబరు 4న తుది జాబితా విడుదల**

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికలకు అక్టోబరు 6న షెడ్యూల్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు విడివిడిగా జరుగుతాయని ఇప్పటికే స్పష్టమైంది. దాంతో.. ప్రస్తుత శాసనసభ గడువు ముగిసేలోపే ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వాలి. అంటే.. 2018లో.. డిసెంబరు 7న ఎన్నికలు జరిగాయి. జనవరి 16న శాసనసభ తొలి సమావేశం జరిగింది. దీన్ని బట్టి.. 2024 జనవరి 17లోపు కొత్త శాసనసభ కొలువుదీరాలి. అందుకు అనుగుణంగా ఈ ఏడాది అక్టోబరు మొదటి వారంలో షెడ్యూల్ విడుదలవ్వాలి. ఆ తర్వాత.. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు కనీసం రెండు నెలల సమయం అవసరం. మంత్రి కేటీఆర్ కూడా “అక్టోబరు 10లోపు షెడ్యూల్ విడుదలవ్వాలి. అంతకు మించి ఆలస్యం జరిగితే.. ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయి” అంటూ ఈ మధ్య ఎక్స్ వేదికగా అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అక్టోబరు మొదటి వారంలోనే షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశాలున్నట్లు స్పష్టమవుతుంది. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) తరఫున రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనకు ప్రత్యేక బృందం రానుంది. అక్టోబరు 3, 4, 5 తేదీల్లో ఈ బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది, పోలీసు బందోబస్తు వంటి పలు అంశాలను పరిశీలించనుంది. ఈ పరిశీలన పూర్తయిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేక నివేదికను సమర్పించనుంది. ఆ నివేదిక అందిన వెంటనే ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం అక్టోబరు 6న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ ఆ తేదీన కుదరకపోతే.. అక్టోబరు 10వ తేదీలోపు షెడ్యూల్‌ను జారీ చేస్తారని భావిస్తున్నారు. షెడ్యూల్ జారీ అయిన నెల తర్వాత నోటిఫికేషన్‌ను విడుదల అవుతుంది. ఆ తర్వాత.. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్ల పర్వం ప్రారంభమైన నెల రోజుల్లో ఎన్నికల ప్రక్రియను ముగించాలి. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించి రాష్ట్ర అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేశారు. అటు ఓటర్ల జాబితా రెండో సవరణలో భాగంగా అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను మంగళవారం ముగించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 వరకు కొత్త ఓటర్ల నమోదుకు 13.06లక్షల దరఖాస్తులు, పేర్ల తొలగింపునకు 6.26 లక్షల అర్జీలు అందాయి. సవరణలకోసం 7.77 లక్షల దరఖాస్తులు అందినట్లు ఎన్నికల విభాగం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఈనెల 27 లోపు పరిష్కరించి.. అక్టోబరు 4న తుది జాబితాను విడుదల చేస్తారు. గడువు ముగిసినప్పటికీ.. పౌరులు ఎప్పుడైనా దరఖాస్తులు పంపే వెసులుబాటు ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) కార్యాలయం వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 14.72 లక్షల మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారని, 18-19 ఏళ్ళ వయసున్న ఓటర్లు జనవరి 5 నాటికి 2.79 లక్షలుండగా, మంగళవారం వరకు 6.51 లక్షలకు పెరిగినట్లు తెలిపింది. మొత్తం ఓటర్లు 3.13 కోట్లు ఉన్నారని, ఇందులో పురుషుల సంఖ్య 1.57 కోట్లు కాగా.. మహిళల వాటా 1.56 కోట్లు, ఇతరులు 2,226 మంది ఉన్నారు. వివిధ కారణాల వల్ల 3.39 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించారు.



## మహిళా కోటాలో నా సీటు వదులుకోవడానికి సిద్ధం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : మహిళా రిజర్వేషన్ బిల్లును తాను పూర్తిగా స్వాగతిస్తున్నానని మంత్రి కేటీఆర్ తెలిపారు. మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా కోటాలో తన సీటు వదులుకోవడానికి కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అంతర్జాతీయ టెక్‌పార్క్‌ను బుధవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మన జీవితాలు చాలా చిన్నవని.. తన పాత్ర తాను పోషించానని పేర్కొన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచానికి వ్యాక్సిన్లు ఉత్పత్తి చేసే స్థాయికి హైదరాబాద్ మహానగరం చేరుకుందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో 40 శాతానికి పైగా ఫార్మారంగ ఉత్పత్తులు ఇక్కడి నుంచే వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ లైఫ్‌సైన్సెస్ హబ్‌గా మారుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ చాలా అందమైన నగరమని.. ఇక్కడ టాలెంట్‌కు కొరత లేదని అన్నారు. ఇతర దేశాలతో పోలిస్తే ఇక్కడ ఖర్చు కూడా తక్కువేనని తెలిపారు.

# ఎంఎల్సీల ఫైలుకు రెడ్ సిగ్నల్ ?

హైదరాబాద్ : కేసీఆర్, గవర్నర్ మధ్య వార్ ఇంకా నడుస్తూనే ఉంది. ప్రస్తుతం గవర్నర్ దగ్గరున్న ఇద్దరు ఎంఎల్సీల ఫైల్ పై సంతకం చేయడానికి గవర్నర్ తమిళిసై ఇష్టపడటం లేదని అర్ధమవుతోంది. గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణను నామినేట్ చేస్తు మంత్రివర్గం గవర్నర్ కు ఫైలు పంపింది. దాదాపు నెల రోజుల క్రితం వెళ్లిన ఫైలుపై గవర్నర్ ఇంతవరకు సంతకం పెట్టకుండా అలాగే పెండింగులో ఉంచారు. గతంలో పాడి కౌశిక్ రెడ్డి విషయంలో ఏమి జరిగిందో ఇపుడు కూడా అదే జరుగుతోంది. పైగా ఇద్దరి పేర్ల సిఫారసులపై సంతకం పెట్టే విషయం పరిశీలనలో ఉందని స్వయంగా గవర్నరే చెప్పారు. గవర్నర్ కోటాలో భర్తీచేయాల్సిన ఇద్దరి నేపధ్యం అందుకు సరిగ్గా ఫిట్టవుతుందో లేదో పరిశీలించకుండా తాను సంతకం పెట్టనని గవర్నర్ స్పష్టంగా చెప్పేశారు. దాంతో వీళ్ళ నియామకానికి గవర్నర్ ఆమోదముద్ర వేయరనే విషయం అర్ధమైపోతోంది. గవర్నర్ కోటా అంటే రాజకీయంగా ఎవరికిపడితే వారిని ఎలాపడితే అలా నామినేట్ చేయటానికి ఇతరత్రా కోటా కాదన్నారు. ఎందుకంటే గతంలో కౌశిక్ రెడ్డి నియామకానికి కూడా గవర్నర్ ఆమోదం చెప్పలేదు. వేరేదారిలేక కేసీయార్ గవర్నర్ కు పంపిన సిఫారసులను ఉపసంహరించుకున్నారు. ఎందుకంటే కౌశిక్ పై అనేక కేసులున్నాయి. కాబట్టి కేసుల్లో ఇరుక్కున్న వారికి తాను ఆమోదం తెలిపే ప్రసక్తే లేదని చెప్పేశారు. అందుకనే కేసీయార్ ఆ ఫైలును ఉపసంహరించుకుని తర్వాత ఎంఎల్ఏల కోటాలో ఎంఎల్సీని చేశారు. కేసీయార్ నుండి వచ్చిన ప్రతిఫైలుపైన గవర్నర్ గుడ్డిగా ఎలాపడితే అలా సంతకాలు చేసేసి పంపే పద్దతికి స్వస్తిపలికారు. ప్రతిఫైలును గవర్నర్ క్షుణ్ణంగా చదువుతున్నారు. మంచి చెడ్డు పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాల నుండి రిపోర్టును కూడా తెప్పించుకుంటున్నారు. ఇదంతా చూస్తుంటే గవర్నర్ కోటాలో ఎంఎల్సీలు అయ్యే అర్హత శ్రవణ్, కుర్రాకు లేదని బహుశా గవర్నర్ అభిప్రాయంతో ఉన్నట్లు అర్ధమవుతోంది. మరి తన వద్దే గవర్నర్ ఈ ఫైలును ఎంతకాలం అట్టిపెట్టుకుంటారో తెలీటంలేదు. చూస్తుంటే కేసీయార్ తొందరలోనే ఈ ఫైలును వెనక్కు తెప్పించుకునే అవకాశం లేకపోలేదని సమాచారం.



# టోటల్ ఛేంజ్




## ‘మహిళా బిల్లు’తో బిఆర్ఎస్ అభ్యర్థుల చిట్టాలో మార్పులు..!

హైదరాబాద్ : దాదాపు నెలన్నర క్రితం కేసీఆర్ ప్రకటించిన మొదటి జాబితా అభ్యర్థుల్లో మార్పులు చేయకతప్పదని అనిపిస్తోంది. మిగిలిన పార్టీల కన్నా ముందుగా అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తే ఉపయోగం ఉంటుందన్నది కేసీయార్ ఆలోచన. నిజంగా కేసీఆర్ ఆలోచన ఒకరకంగా కరెక్టే అనడంలో సందేహం లేదు. అయితే మొదటి జాబితా ప్రకటించిన తర్వాత జాతీయ రాజకీయాల్లో సడెన్ గా మార్పులు జరిగిపోతున్నాయి. దాని ప్రభావం తెలంగాణాలో బీఆర్ఎస్ ఫస్ట్ లిస్ట్ మీద కూడా పడుతోంది. విషయం ఏమిటంటే పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు పాస్ అయ్యేట్లే ఉంది. ఇదిగనుక పాస్ అయితే పార్లమెంటుతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అన్నీ రాష్ట్రాలు 33 శాతం మహిళలకు కచ్చితంగా టికెట్లు ఇచ్చి తీరాల్సిందే. కాకపోతే ఈ తీర్మానం తక్షణమే అటే జరగబోయే ప్రతి ఎన్నికల నుండి రాదని తేలిపోయింది. బిల్లు చట్టమైన తర్వాత 2029 న సార్వత్రిక ఎన్నికల నుండి అమల్లోకి వస్తుంది. 2024 ఎన్నికల నుండి వర్తించకపోయినా బిల్లు చట్టంగా మారగానే వెంటనే మహిళా నేతలైతే టికెట్లు డిమాండ్ చేస్తారు. అంటే 2024 సార్వత్రిక లోక్ సభ ఎన్నికల్లోపు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి రాష్ట్రంలోను మహిళలకు రిజర్వేషన్ వర్తింపచేయాల్సుంటుంది. లేకపోతే మహిళల ఓట్లు పార్టీలకు పడేది అనుమానమే. అందుకనే కేసీయార్ మొదటిజాబితాలో మార్పులు తప్పేట్లు లేదు. ఇక రెండో కారణం ఏమిటంటే చాలామంది సిట్టింగులపై జనాల్లో విపరీతమైన వ్యతిరేకత కనబడుతోంది. వ్యతిరేకత మామూలు జనాల్లోనే కాకుండా పార్టీ నేతలు, క్యాడర్లో కూడా పెరిగిపోతోంది.

# ఆందోళనలో అభ్యర్థులు

దీన్ని నిశితంగా గమనిస్తున్న కేసీయార్ పై రెండు కారణాలను చూపించి మొదటిజాబితాను రద్దుచేసినా ఆశ్చర్యపోక్కర్లేదని పార్టీలోనే టాక్ వినబడుతోంది. ఇక్కడ సమస్య ఏమిటంటే మొదటిజాబితాను రద్దుచేస్తే సిట్టింగుల్లో కేసీయార్ పై వ్యతిరేకత పెరిగిపోతుంది. అప్పుడు వాళ్ళల్లో ఎంతమంది కేసీయార్ పై తిరుగుబాటు చేస్తారో తెలీదు. ఇక మార్పులు చేయకపోతే మహిళలు, పార్టీలో నేతలు, క్యాడర్ ఎంతమంది సిట్టింగులకు వ్యతిరేకంగ పనిచేస్తారో తెలీదు. మొత్తంమీద జాబితాలో అయితే మార్పులు తప్పవనే అనుకుంటున్నారు. చివరకు ఏమి జరుగుతుందో చూడాలి.

# మల్టీజోన్‌లో బదిలీలు.. ఆప్షన్లకు తంటాలు

కరీంనగర్ : మల్టీజోనల్ కింద చేపడుతున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలపై రెండు రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని విద్యా శాఖ సూచించడంతో వారు ఆ పనిలో నిమగ్నమయ్యారు. విద్యా శాఖ షెడ్యూల్ ప్రకారం ఈనెల 12, 13 తేదీల్లో ఈ పనిని వారు పూర్తి చేయాల్సి ఉన్నా, పలు కారణాలతో వెబ్ ఆప్షన్లు పెట్టుకునే ప్రక్రియను ప్రారంభించలేదు. ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, దీనికి శనివారం గడువు విధించడంతో ప్రధానోపాధ్యాయులు ఆప్షన్లు పెట్టుకునే పనిలో ఉన్నారు. ఆది, సోమవారాల్లో వీరి బదిలీల ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. ఆన్‌లైన్ నమోదులో ప్రధానోపాధ్యాయుల బిజీ జిల్లాలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీలు 41 ఉండగా, అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని తప్పనిసరి బదిలీ అయ్యే వారు 45 మంది ఉన్నారు. మల్టీజోన్ పరిధిలో 1100 వరకు ఉన్నారు. సీనియారిటీ జాబితాను అనుసరించి ఆప్షన్లు పెట్టుకునేందుకు ప్రధానోపాధ్యాయులు నానా తంటాలు పడుతున్నారు. వంద లోపు సీనియారిటీ ఉన్న వారికి ఈ పరిస్థితి లేకపోగా, ఆపై ఉన్న వారికి ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. 70 ఆప్షన్లు పెట్టుకునే సరికే రెండు గంటలు పట్టిందని ప్రధానోపాధ్యాయుడు ఒకరు తెలిపారు. ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించి, మరుసటి రోజు తుది గడువు పెట్టడంతో ఈప్రక్రియను పూర్తి చేయడం తలకు మించిన



భారంగా మారిందని వారు పేర్కొంటున్నారు. కరీంనగర్ జిల్లా తర్వాత పక్క జిల్లాల్లోని పాఠశాలలనే ఆప్షన్లుగా ఎంచుకునేందుకు ఆసక్తి చూపుతు న్నారు.

ఎడిట్ ఆప్షన్ ఉన్నట్టా..లేనట్టా..


మొదట విద్యాశాఖ జారీ చేసిన బదిలీ షెడ్యూల్‌లో ఎడిట్ ఆప్షన్‌ను ఇచ్చి ఇందుకు ఒక రోజును కేటాయించారు. శుక్ర, శనివారాల్లో ఈప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ సూచించినా ఎడిట్ ఆప్షన్‌పై స్పష్టత ఇవ్వలేదని పలువురు పేర్కొన్నారు. హడావిడిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పుడు దొర్లే తప్పులను సరిదిద్దుకునేందుకు విద్యాశాఖ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

# బ్రాండ్ జోరు.. యువత హెూరు

మిర్యాలగూడ : మారుతున్న కాలానికి అనుగుణంగా యువత బ్రాండెడ్ వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు. బ్రాండ్‌ను సమాజంలో స్టేటస్ సింబల్‌గా గుర్తిస్తున్న అనేక మంది యువత.. దుస్తులు, చేతి గడియారాలు, కళ్లద్దాలు, చెప్పులు, బూట్లు..ఏదైనా బ్రాండ్‌కే సై అంటున్నారు. బ్రాండ్‌ను బట్టి ధర ఎంతైనా కొనుగోలుకు ముందుకు వస్తుండడంతో.. గతంలో మెట్రో నగరాలకే పరిమితమైన బ్రాండెడ్ వస్త్రాలు, ఇతర అలంకరణ వస్తువుల షోరూంలు ప్రస్తుతం చిన్న చిన్న పట్టణాల్లో సైతం వెలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల కాలంలో విరివిగా వెలుస్తున్న బ్రాండెడ్ షోరూంలే దీనికి నిదర్శనం.. ఆఫర్లతో ఆకట్టుకుంటూ..బ్రాండెడ్ దుస్తులు అనగానే ధర ఎక్కువగా ఉంటుందనేది వాస్తవం. అయితే షోరూంల నిర్వాహకులు కొనుగోలుదారులను ఆకర్షించేందుకు అనేక ఆఫర్లను ప్రకటిస్తుంటాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ధరలో రాయితీ, ఒకటి కొంటే ఒకటి ఉచితం..వంటి ఆఫర్లతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఒకసారి కొనుగోలు చేసిన వారి చరవాణి నంబర్లకు ఆఫర్ల సందర్భాల్లో సందేశాలు పంపిస్తూ సమాచారం అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడలో..ఒక్కో పట్టణంలో 20 వరకు బ్రాండెడ్ దుస్తులు, చెప్పులు, కళ్లద్దాల షోరూంలు ఉన్నాయి. హాలియా, నేరేడుచర్ల వంటి పట్టణాల్లోనూ దుస్తుల షోరూంలు వెలుస్తున్నాయి.

పదుల సంఖ్యలో బ్రాండ్లు, షోరూంలు..

గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ దుస్తులు, పాదరక్షల దుకాణాలు మాత్రమే ఉండేవి. దీంతో చేసేదేం లేక వాటిలోనే నచ్చినవి కొనుగోలు చేసేవారు. ఇటీవల కాలంలో యువత బ్రాండెడ్ దుస్తుల షాపింగ్ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు సైతం వెళ్తుండడాన్ని గమనించిన తయారీదారులు..ద్వితీయ శ్రేణి పట్టణాల్లో సైతం బ్రాండెడ్ షోరూంలు ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. దీనికి తోడు యువత ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా రకారకాల నమూనాలు, డిజైన్లను అందుబాటులో ఉంచుతూ..యువతకు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా



రు. జాకీ, ట్విల్స్, అలెన్‌సోలీ, హంటర్, డెనిమ్, వైట్ హౌస్, రేమండ్స్, అర్వింద్, పీటర్ ఇంగ్లాండ్, జస్ట్ ఫర్‌యూ, కైరా, బాటా, ప్రాఫిట్, లెన్స్‌కార్ట్ వంటి బ్రాండెడ్ షోరూంలో ఎన్నో జిల్లాలో వెలిశాయి. వీటితో పాటు నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేటలో కార్పొరేట్ మాల్స్ వెలుస్తూ.. వాటిలోనూ బ్రాండెడ్ దుస్తులను విక్రయిస్తున్నారు.

నాణ్యతలో రాజీ ఉండదు

రాపోలు భానుమూర్తి, ట్విల్స్ షోరూం నిర్వాహకుడు, మిర్యాలగూడ

నేను 28 ఏళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాను. ఇటీవల కాలంలో బ్రాండెడ్ దుస్తుల పట్ల యువతలో పెరిగిన ఆసక్తి నేపథ్యంలో ప్రత్యేకంగా షోరూంను సైతం ఏర్పాటు చేశాను. బ్రాండెడ్ దుస్తులు ధర ఎక్కువగా ఉన్నా..నాణ్యతలో రాజీ పడకపోవడం, ఆకర్షణీయంగా, సౌకర్యంగా ఉండడంతో కొనుగోలుకు యువత ఆసక్తి చూపుతున్నారు. వస్త్రాన్ని కొని కుట్టించుకోవాలంటే.. ధర, సమయం వృథా అవుతున్నాయి. దీంతో రెడీమేడ్ బ్రాండెడ్ దుస్తులకు ఆదరణ పెరిగింది. అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లు సైతం ప్రస్తుతం నల్గొండ, మిర్యాలగూడ వంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ లభ్యమవుతున్నాయి.

# నగర రహదారులు బాగుపడేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో వర్షాలకు అంతర్గత రహదారులు గుంతలు పడి దారుణంగా మారాయి. నగర వీధులతోపాటు శివారు ప్రాంతాల్లో పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతుండగా ఏటా వినాయక చవితి, బతుకమ్మ పండుగల సందర్భంలో పనులు చేస్తుంటారు. వినాయక మండపాలు పెట్టే రహదారులతోపాటు సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో ఆయా కార్పొరేటర్లు సూచించిన విధంగా ప్యాచ్ వర్క్‌తో ఇబ్బందులను తొలగించాల్సి ఉంటుంది. గణేశ్ పండుగ, నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్ల కోసం ఈ ఏడాది కూడా నిధులు కేటాయించారు. నగరంలో నిమజ్జన స్థలాల్లో ఏర్పాట్ల కోసం మొత్తం 72 పనులు ఉండగా రూ.49.09 లక్షలు కేటాయించారు.

అవసరమున్న చోట తక్కువ..శివారు ప్రాంతాలు, మట్టి రోడ్లు అధికంగా ఉన్న డివిజన్లకు తక్కువ, సీసీ రోడ్లు ఎక్కువగా ఉన్న చోట ఎక్కువ నిధులు కేటాయించడంతో ప్రజావసరాలకు తగ్గట్లుగా మరమ్మతు చేసే అవకాశం లభించదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విలీన కాలనీల్లో పెద్ద, పెద్ద గుంతలు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. వీటిని పండుగల సమయంలోనే బాగు చేస్తారు. 37 డివిజన్లకు రూ.50 వేల చొప్పున, రెండింటికి రూ.60 వేలు, 8 డివిజన్లకు రూ.70 వేలు, నాలుగింటికి రూ.80 వేలు, రూ.90 వేలు చొప్పున, రెండింటికి రూ.99 వేలు, మూడింటికి రూ.98 వేలు కేటాయించారు. వీటితోపాటు నిమజ్జన స్థలాలు కూడా ఉన్నాయి.

ఎప్పటిలాగే గుంతలు

డివిజన్ల వారీగా టెండర్లు పిలిచిన అధికారులు నిబంధనల ప్రకారం పనులు చేస్తే గుంతల లొల్లి తగ్గే అవకాశముంటుంది. రోడ్లపై మట్టి, సీసీ రోడ్డు దెబ్బతింటే సీసీ ప్యాచ్ చేస్తే ప్రయోజనముంటుంది. కంకరపొడి పోస్తే ఒక్క వర్షానికే ఎక్కడికక్కడే కొట్టుకుపోయి కొత్త సమస్యలు మొదలవుతాయి. అత్యధిక శాతం సీసీ ప్యాచ్, మట్టికి బదులుగా కంకరపొడి పోసి మమ అనిపిస్తున్నారు. అలా కాకుండా ఎక్కడ ఏం అవసరముంటుందో అవే పనులు చేయాల్సిన బాధ్యత ఆయా డివిజన్ల ఇంజినీరింగ్ అధికారులపై ఆధారపడి ఉంటుంది.

ముందుగానే ప్రారంభించాలి

వినాయక చవితి ఈనెల 18 నుంచి ప్రారంభం అవుతుండగా నిమజ్జనంలోగా అంటే దాదాపు పది రోజుల్లో పక్కాగా ప్రణాళిక ప్రకారం పనులు చేస్తే పూర్తవుతాయి. ఏటా పండుగల టెండర్లలో గుత్తేదారులు పాల్గొనకపోవడం, పాలకవర్గ సభ్యులు బుజ్జగించి టెండర్లలో పాల్గొనేలా చూడాల్సి వస్తుండటంతో సమయం మించిపోతుంది. ఇంకేముంది ఒకటెండ్రు రెండు రోజుల ముందు కంకరపొడి పోసి పత్తా లేకుండా పోతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా పక్కాగా మరమ్మతులు చేసేలా పర్యవేక్షణ చేయాల్సిన అవసరముంది.

# ప్యాకేజీలుగా విడగొట్టి.. అభివృద్ధి పనులు



కరీంనగర్ : జిల్లా అధికారులు ప్యాకేజీలుగా విడగొట్టి అభివృద్ధి పనులు చేయడంపై ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆగ్రహంగా ఉన్నారు. నిబంధనల ప్రకారం వీరి పరిధిలో రూ.2 లక్షల వరకు మాత్రమే పనులు చేయాల్సి ఉంటుంది. పెద్ద పనిని ముక్కలుగా విభజించి చేయడంతో ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లింది. వారు సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

సమావేశ గది నిర్మాణానికి..ఎస్ఈ, డీఈలు, ఏడీఈ, ఏఈ, ఎస్ఏవో, ఏవో, ఏఏవో తదితర ఉన్నతాధికారులతో ప్రతి నెల ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) సమావేశం నిర్వహించడం ఆనవాయితి. ఇందుకు జడ్పీ సమావేశ మందిరం, కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏదో ఒక దానిని వినియోగించేవారు. కరోనాతో భౌతిక సమావేశాలు నిలిచిపోయి.. ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెల ఇతర సంస్థలపై ఆధారపడటం ఎందుకు అని విద్యుత్తు అధికారులు భావించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని రూరల్ ఈఆర్‌వో కార్యాలయాన్ని పునరుద్ధరిస్తే సమావేశాలకు, సమీక్షలకు అనువుగా ఉంటుందని తలచారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు.

గతంలో ఓ అధికారిపై చర్యలు

ఎస్ఈకి సివిల్ పనుల్లో రూ.2 లక్షలకు మించి ఖర్చు చేసే అధికారం లేదు. సమావేశం గదిని పునరుద్ధరించడానికి ప్యాకేజీలుగా విడగొట్టి.. విడతల వారీగా రూ.7 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇలా చేయడం సీఎండీ మౌఖిక ఆదేశాలకు విరుద్ధమని కొందరు అధికారులు అంటున్నారు. మూడు నెలల కిందట జగిత్యాల కేంద్రంగా పని చేస్తున్న ఓ ఇంజినీర్ పెద్దపల్లి జిల్లా సివిల్ విభాగం అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా ప్యాకేజీల వారీగా అభివృద్ధి పనులు చేశారు. ఆ విషయం సంస్థ ఉన్నతాధికారి దృష్టికి వెళ్లడంతో ఏకంగా భద్రాచలానికి బదిలీ చేశారు. ఇప్పుడు కరీంనగర్‌లో అలాగే జరగడం ఆ సంస్థలో చర్చనీయాంశం అవుతోంది.

# కౌలు రైతుల కష్టాలు

కరీంనగర్ :రాష్ట్రంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతుల్లో 75- 80 శాతం కౌలు రైతులేనని రైతు స్వరాజ్య వేదిక అధ్యయనంలో వెల్లడయింది. ఉమ్మడి జిల్లాలోనూ అత్యధిక సంఖ్యలో కౌలు రైతులుండగా సాగురంగంలో వీరికి పలు రీతులుగా భరోసా కల్పించాల్సి ఉంది.సన్న, చిన్నకారు రైతుల్లోనూ 65 శాతం ఇతరుల పొలాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటారు.

అందని రుణం : కౌలు రైతుల్లో ఏ మాత్రం భూమిలేనివారితోపాటు తక్కువ విస్తీర్ణంలో సొంత భూమి ఉండి ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నవారు ఉన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలున్న రైతులకు బ్యాంకులు నేరుగా రుణాలను ఇస్తుండగా కౌలు రైతులకు కూడా పంటరుణాలను ఇప్పించాలని ప్రభుత్వం 2011లో రుణ అర్హత కార్డులను జారీ చేసింది. కానీ ఈ కార్డులను పూచీకత్తుగా తీసుకుని రుణాలను ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రాలేదు. 2011లో జిల్లాలో 24 వేల మంది రుణఅర్హత కార్డులకు దరఖాస్తు చేసుకోగా 15,863 మందికి కార్డులను ఇవ్వగా వీరిలో 3 వేల మందికి రూ.8 కోట్ల పంట రుణాలను అందించగలిగారు. తరవాత వివిధ కారణాలతో బ్యాంకర్లు ముందుకు రాలేదు. దీంతో ప్రైవేటు అప్పులు, వడ్డీభారం పెరిగి రైతులు నష్టాల పాలవుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత పాలనలో రూ.లక్ష వరకు, ప్రస్తుతం రెండో విడతలో రూ.లక్ష వరకు పంట రుణాన్ని మాఫీ చేయగా ఉమ్మడి జిల్లాలోని రైతులకు దాదాపుగా రూ.3,650 కోట్ల వరకు ప్రయోజనం కలిగింది. కానీ ఈ ప్రయోజనం కౌలు రైతులకు అందనిదే. వారికి రుణాలే రాని నేపథ్యంలో మాఫీ వర్తించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలు రైతులకు ఇప్పటికయినా కార్డులిచ్చి రుణాలను అందిస్తే సున్నా వడ్డీ, పావలావడ్డీ, రుణమాఫీ తదితరాలు వర్తించి మున్ముందు ప్రయోజనకరంగా ఉంటుంది.

పథకాల్లోనూ నిరాశే : రైతుబంధు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పట్టాదారులైన రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా విడుదల చేస్తోంది. ఒక సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 6.49 లక్షల మంది రైతులకు రూ.650 కోట్ల రైతుబంధు నిధులు వస్తున్నాయి. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా కేంద్రం నుంచి ఒక్కో రైతుకు ఏడాదికి రూ. 6 వేలను ఇస్తుండగా జిల్లాలోని పట్టాదారులైన 3.41 లక్షల మంది రైతులకు నిధులను అందిస్తున్నారు. అలాగే ఏ కారణంచేత రైతు మృతిచెందినా రూ.5 లక్షలను చెల్లిస్తున్న రైతు బీమా పథకంలోనూ ఉమ్మడి జిల్లాలో 3.61 లక్షల మంది రైతులు నమోదై ఉన్నారు. ఈ పథకాలేవీ కౌలురైతుల దరిచేరటం లేదు.

రాయితీ హుళక్కే : గతంలో వ్యవసాయ యాంత్రీకరణ, యంత్రలక్ష్మి, ఆర్కేవీవై తదితర పథకాల ద్వారా యంత్రాలు, పనిముట్లను, వ్యవసాయ, ఉద్యానశాఖల ద్వారా అన్ని పంటలు, కూరగాయల విత్తనాలను, షేడ్‌నెట్లు తదితరాలను 50 శాతం రాయితీపై అందించగా



ప్రస్తుతం వీటి సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఇటు రాయితీ అందక.. అటు రైతుబంధు సాయం లేక బయట అప్పులు తెచ్చి కౌలు రైతు సాగు చేయాల్సి వస్తోంది.

భరోసా లేదు : గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రైతు ఆత్మహత్యల్లో జిల్లా రెండో స్థానంలో ఉండగా ఆత్మహత్యకు పాల్పడిన చాలామంది రైతుల కుటుంబాలకు పరిహారం అందలేదు. జీవో నం.421 ప్రకారం ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.6 లక్షల పరిహారాన్ని మంజూరివ్వాలి. కేంద్రం ఇస్తామన్న రూ.50 వేలను అందించాలి. ఆత్మహత్యకు పాల్పడిన రైతుల పిల్లలను వసతిగృహంలో చేర్పించటం, చదువు చెప్పించటం, గృహాల మంజూరు, వితంతు పింఛన్ మంజూరు, రేషన్‌కార్డు జారీ, బ్యాంకు ద్వారా రుణం మంజూరు తదితరాలను నెరవేర్చాలి. కానీ ఈ జీవో అమలు కావడం లేదు. దీంతో కౌలు రైతులు అప్పులు భరించలేక బలవన్మరణానికి పాల్పడినా ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఎలాంటి భరోసా ఉండటం లేదు.

కొరవడిన ఆసరా : కందులు, మక్కలు, ధాన్యం తదితర ఉత్పత్తులను ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేసినపుడు ఆన్‌లైన్‌లో సాగు నమోదై ఉన్న పట్టాదారుల పేరిటనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కౌలు రైతులు పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కౌలు రైతులు నేరుగా ప్రభుత్వరంగ సంస్థలకు ఉత్పత్తులను విక్రయించేలా చూడాలి. పంటలబీమా పథకాన్ని అమలు చేసినపుడు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిన్న సందర్భాల్లోనూ నష్టపరిహారాన్ని పట్టాదారులైన రైతుల పేరిటే విడుదల చేస్తున్నారు. నష్టపరిహారాన్ని పంటలను సాగుచేసే రైతులకే అందేలా చూడాలి.

ఉమ్మడి జిల్లాలో మొత్తం అన్నదాతలు : 6,62,345

సన్న, చిన్నకారు రైతులు : 3,13,740

కౌలు రైతులు : 84,391

# నంబరు ప్లేట్లు మార్చి చోరీలు

దామరచర్ల : ద్విచక్ర వాహనాలపై వచ్చి చోరీలకు పాల్పడుతున్న దొంగలు హైటెక్ పద్ధతులు ఆచరించి ఆనవాళ్లు గుర్తించకుండా వ్యవహరించి దర్జాగా తప్పించుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలు జిల్లాలో పలు ప్రాంతాలలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈనెల 13న దామరచర్లలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి వెంట గ్రాండ్‌శ్రీ హెూటల్ ఎదురుగా నిలిపి ఉంచిన కారు అద్దం పగులగొట్టి అందులో రూ.4.75 లక్షల నగదు ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లిన ఘటనపై పోలీసులు జరుపుతున్న విచారణలో పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఇద్దరు యువకులు ఈ చోరీలో పాల్గొనగా వారు వినియోగించిన ద్విచక్రవాహనం నంబరు సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైంది. ఆ నంబరును పరిశీలించగా అది కోదాడకు చెందిన ఓ వ్యక్తి వాహనానికి చెందినదిగా గుర్తించారు. అతడిని ఆరా తీయగా తనకు యమహా బైక్ ఉందని, నాలుగు రోజుల క్రితం అమ్మకానికి ఓఎల్ఎక్స్‌లో పెట్టానని వెల్లడించారు. ఆ నంబరు గల ప్లేట్‌ను యువకులు తమ ఎఫ్‌జడ్ వాహనానికి బిగించుకుని చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ తరహా మోసాలు తరచూ జరుగుతున్నాయి.

నెలరోజుల క్రితం నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాళ్లవాగుతండా



వద్ద బైక్‌పై వచ్చిన ఇద్దరు తాళం వేసిన ఇంటిలోకి వెళ్లి బంగారం, వెండి విలువైన వస్తువులు చోరీ చేశారు. యజమాని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు విచారణలో ఉంది. వారు వచ్చిన ద్విచక్ర వాహనాన్ని రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలో ఫుటేజీలో పోలీసులు పరిశీలించారు. అది తప్పుడు నంబరుగా గుర్తించారు.

బైక్‌లను ఎత్తుకెళ్లిన వారు రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్లను తొలగించి ఇతరులు వినియోగిస్తున్న నంబర్లను వాడుతున్నారు. కొండ్రపోల్‌కు చెందిన పరంగి వెంకన్నకు వారం రోజుల క్రితం చరవాణికి సంక్షిప్త సందేశం వచ్చింది. యాదగిరిగుట్టలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినందుకు రూ.500 జరిమానా విధించినట్లు ఆ సందేశంలో పేర్కొన్నారు. తదుపరి టీఎస్ పోలీస్ ఈ- చలాన్ వెబ్‌సైట్‌లో పరిశీలించగా వేరే వాహనం వెనుక తన బైక్ నంబరు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విధంగా చాలామందికి ట్రాఫిక్ జరిమానాలు వస్తున్నాయి.

చోరులను పట్టుకుంటాం

– రవికుమార్ ఎస్సై, వాడపల్లి

నంబరు ప్లేట్లను మార్చి బైక్‌లపై వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు కృషి చేస్తున్నాం. ఇక నుంచి ద్విచక్రవాహన నంబరు ప్లేట్లను పరిశీలిస్తాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

# అంచనాలకు మించి వరి సాగు

గరిడేపల్లి : సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో వరి అంచనాకు మించి సాగయింది. ఆగస్టు 31 నాటికే వానాకాలం నాట్లు పూర్తవ్వాల్సి ఉన్నా నిన్నటి వరకు సాగాయి. బోర్లు, బావుల కింద ఆయకట్టు భారీగా పెరిగింది. ఎడమ కాల్వకు నీరు విడుదల చేయకపోవడంతో ఆయకట్టులో 30 శాతం కూడా సాగయ్యే అవకాశం లేదని ముందుగా అంచనా వేశారు. వానాకాలం ఆరంభంలో వర్షాలు లేకపోవడం, బావులు, బోర్లలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో వ్యవసాయశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు, రైతులు సైతం సాగు పూర్తిగా పడిపోతుందని అభిప్రాయపడ్డారు. అందుకు భిన్నంగా వరి సాగు పెరిగినట్లు వ్యవసాయ శాఖ సర్వేలో తేలింది.

సాగు ఇలా..ఏప్రిల్ మొదటి వారం నుంచి సెప్టెంబర్ 31 వరకు వ్యవసాయ శాఖ ఖరీఫ్ కాలంగా గుర్తిస్తుంది. కొంతకాలంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, సాగర్ నీటి విడుదల, వర్షాభావ పరిస్థితులను బట్టి ఖరీఫ్‌ను జూన్, జులై, ఆగస్టు 31కే పరిమితం చేస్తున్నారు. ఆగస్టు 15 వరకు నాట్లు పూర్తి చేస్తే చీడపీడల బెడద తగ్గుతుందని ఆగస్టు 31లోపు పూర్తి చేసినా కొంతమేర బయటపడవచ్చని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సెప్టెంబర్‌లో నాట్లు వేయడం వల్ల పంట చేతికి వచ్చే ముందు అంటే ఈత దశలో పరపరాగ సంపర్కంలో ఇబ్బందులు వస్తాయి. చలి తీవ్రతకు ఉదయం పూలు విచ్చుకోకపోవడంతో దిగుబడి బాగా తగ్గుతుందని చెప్తున్నారు. అందుకే నవంబర్ 15 నాటికి ఈత, గింజ పోసుకునే దశకు వచ్చేలా నాట్లు పూర్తిచేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం స్వల్పకాలిక వంగడాలు వచ్చినందున రైతులు సెప్టెంబర్ మొదటి వారం వరకు నాట్లు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 లక్షల ఎకరాలలో వరి సాగైనట్లు అంచనా. నల్గొండ జిల్లాలో 5.03 లక్షల ఎకరాలలో వరి సాగు కాగా.. అందులో ఎడమ కాల్వ కింద 1.26 లక్షల ఎకరాలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 4.30 లక్షల ఎకరాలలో వరి సాగుకాగా, అందులో ఎడమ కాల్వ కింద 2.22 లక్షల ఎకరాలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో సైతం బోర్లు, బావుల కింద 3.04 లక్షల ఎకరాలలో వరి సాగయింది.

కొత్తగా బోర్లపై పెట్టుబడి

సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టుకు నీటి విడుదల ప్రకటన రాకపోవడంతో రైతులు పూర్తిగా బోర్లు, బావులపైనే ఆధారపడి సాగు చేపట్టారు. సాగునీటి ఆధారం ఉన్న రైతులు జూన్, జులైలో నార్లు పోసుకోగా, పలువురు ఆగస్టు మొదటి వారం నుంచి డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతిలో, సీడ్ డ్రిల్‌తో విత్తనం వేశారు. నార్లు పోసుకున్న వారు జులై మూడో వారం నుంచి నాట్లు వేసుకున్నారు. ఆ తరుణంలోనే వర్షాలు లేక సాగు తగ్గింది. దాంతో 30 శాతం కూడా నాట్లు కావనే అంచనాకు వచ్చారు. రెండు నెలలు పూర్తిగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పాటు తక్కువ వర్షపాతం నమోదైంది. ఆగస్టు మొదటివారంలో నాట్లు మొదలు పెట్టుకున్న రైతులు జలాశయానికి వరద వస్తుందని ఆశపడ్డారు. ఆ లెక్కనే బోర్ల కింద ఉన్న మొత్తం భూమిలో సాగుకు నార్లు పోసుకున్నారు. కానీ ఎగువ జలాశయాలకు వరద రాకపోగా వర్షాలూ వెనుకంజవేశాయి. ఆగస్టు 15 నాటికి కరవు నెలకొనే వాతావరణం కన్పించింది. నీటి విడుదల కోసం ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా జలాశయాల్లో నీటి లభ్యత లేకపోవడంతో సానుకూలత లభించలేదు. అప్పటికే ఐదారు ఎకరాల్లో వరి నాటు వేసిన రైతులు నీరు అందక రెండు ఎకరాలు వదిలేశారు. వేసిన పంట కాపాడుకునేందుకు కొందరు పెట్టుబడికి వెనకాడకుండా కొత్తగా బోర్లు వేయించారు. కొంతమంది రైతులు కరవు వచ్చే సూచనలున్నాయని, యాసంగి సైతం నీరు విడుదల చేసే అవకాశం లేదనే నిర్ణయానికి వచ్చారు. అందుకే బీడు భూములు ఉన్న రైతులు సైతం ఖర్చు లెక్క చేయకుండా బోర్లు వేయించారు. గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల పరిధిలోనే దాదాపు 400 బోర్లు వేశారు. ఆలస్యమైనా ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్ 15 వరకు నాట్లు వేసుకున్నారు. అందుకే ఆయకట్టు భారీగా పెరిగింది.

# పేపర్-1 సులభం.. 2 కొద్దిగా కఠినం..

వరంగల్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణత సాధించిన వారు ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కు అర్హులు. టెట్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి టీఆర్టీలో ఎక్కువ వెయిటేజీ ఇస్తారు. జరిగిన పేపర్-1 సులభంగా, పేపర్- 2 కొద్దిగా కఠినంగా వచ్చినట్లు అభ్యర్థులు తెలిపారు. గతంలో జరిగిన పరీక్షలతో పోల్చితే ఈ సారి ఎక్కువ మార్కులు సాధిస్తామని పలువురు విద్యార్థులు చెప్పారు. 116 మార్కులు వస్తాయి..- ఎండీ.మహెక్‌ఖతన్, డీఈడీ అభ్యర్థిని డైట్‌లో డీఈడీ పూర్తి చేసి మొదటిసారి టెట్ రాశాను. అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడిగారు. రెగ్యులర్‌గా తరగతులకు, శిక్షణకు హాజరైన వారికి ప్రశ్నపత్రం సులభంగా ఉంది. 116 మార్కులు వచ్చే అవకాశం ఉంది. సీటెట్‌లో 103 మార్కులు సాధించాను.

ప్రణాళికతో సన్నద్ధమయ్యా..- ఎన్.శ్రీకాంత్, డీఈడీ అభ్యర్థి

గతంలో టెట్ రాశాను తక్కువ మార్కులు వచ్చాయి. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికతో సన్నద్ధమయ్యా. సిలబస్‌కు అనుగుణంగానే ప్రశ్నలు ఇచ్చారు. నిర్ణీత సమయంలో పూర్తి చేశాను. వందకుపైగా మార్కులు వస్తాయి.

శిక్షణ తీసుకున్నా- అప్పాల కిరణ్, బీఈడీ అభ్యర్థి

టెట్ రాయడం ఐదోసారి. గతంలో 106 మార్కులు వచ్చాయి. ఎక్కువ



మార్కులు సాధించడానికి ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నా. గత పరీక్ష ప్రశ్నపత్రాలతో పోల్చితే సులభంగా ఉంది. 115పైగా మార్కులు వస్తాయి. గణితం, తెలుగు సబ్జెక్టులు కఠినంగా, మిగితావి చాలా సులభంగా ఇచ్చారు.

రెండోసారి రాశా..- పి.ధనలక్ష్మి, బీఈడీ అభ్యర్థిని

రెండోసారి టెట్ హాజరయ్యా. గతంలో వందలోపు మార్కులు వచ్చాయి. మార్కుల ప్రగతి కోసం మళ్లీ సన్నద్ధమయ్యను. పరీక్షకు తక్కువ సమయం ఉండడంతో పూర్తిగా చదవలేకపోయాను. పేపర్ కొద్దిగా కఠినంగా వచ్చింది. కొద్దిగా కష్టపడితే మంచి మార్కులు వచ్చేవి.

ప్రశాంతంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష

జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా జరిగింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో 42 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులను నిర్ణీత సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అరగంట ముందు నుంచే అనుమతించారు. పేపర్-1కు 9,943 మందికి గాను 8,075 మంది (81.21 శాతం) హాజరయ్యారు. పేపర్-2కు 9,051 అభ్యర్థులకు 8,337 మంది (92.11 శాతం) పరీక్ష రాసారు. ఫైన్ ఉన్నత పాఠశాల, జేఎస్ఎం స్కూల్ కేంద్రాలను కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష జరిగిందని ఆమె తెలిపారు. కలెక్టర్ వెంట డీఈవో డా.ఎండీ.అబ్దుల్‌హై, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ డి.చలపతిరావు ఉన్నారు.

# వీరభద్రుడి ఆలయ పనులపై వీడని నిర్లక్ష్యం!

వరంగల్ : కురవి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఏళ్ల తరబడిగా కొనసాగుతుండగా భక్తులకు కష్టాలు తప్పడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాలకు ప్రాధాన్యమిచ్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. 2017లో మహాశివరాత్రి సందర్భంగా కేసీఆర్ వీరభద్రుడికి బంగారు కోరమీసాలు బహూకరించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే రోజు ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి నెల రోజుల్లోనే మంజూరు ఇచ్చారు. వాటితో ఆలయ రాజగోపురాలతో పాటు అన్ని వసతులు ఉండే విధంగా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు నిర్లక్ష్యం చేయడంతో ఆరేళ్లు పూర్తైనా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. భక్తులకు సకల వసతులు కల్పించడంతో పాటు మరుగు దొడ్లు, మూత్రశాలలు, విశ్రాంతి సత్రాలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. రథశాల, యాగశాల, వీరభద్రస్వామి సత్రం పనులు ఇప్పటివరకు చేపట్టలేదు. ఆలయం పక్కనే ఉన్న పాత కైలాస భవనాన్ని కూల్చి దాని స్థానంలో శ్రీవీరభద్రస్వామి సత్రాలను నిర్మించాలని అనుకున్నప్పటికీ దాని ఊసే ఎత్తడం లేదు. పనులు పూర్తి అయితే ఆలయానికి కొత్త శోభ వస్తుందని భక్తులు భావించినా నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం పీడిస్తోంది.

రథానికి రక్షణ కరవు

రథాన్ని తడవకుండా ఉంచేందుకు ప్రత్యేకంగా రథశాల నిర్మించాలని ప్రభుత్వం రూ.18.48 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రహరీ నిర్మించి గేట్లు ఏర్పాటు చేశారు. దానిపై తాత్కాలికంగా కప్పిన తాటి పత్రి కోతుల ధాటికి చిరిగిపోయింది. ప్రత్యేకంగా షెడ్డు నిర్మించకుండా వదిలేయడంతో చెక్కతో తయారు చేసిన రథం ఎండకు ఎండుతూ వానకు తడుస్తోంది.

పూర్తి కాని ప్రాకార మండపం

గుడికి భక్తులు రాగానే ప్రాకార మండపం కనిపిస్తుంది. అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.74.71 లక్షలు మంజూరయ్యాయి. పనులు మధ్యలోనే నిలిపేశారు.

అరకొరగా బంజార సత్రం గదులుభక్తులు సేద తీరేందుకు నిర్మిస్తున్న బంజార సత్రాల పనులు అరకొరగా కొనసాగుతున్నాయి. రూ.1.65 కోట్లతో నిర్మించి రెండు సత్రాలను రెండు అంతస్తులుగా నిర్మించాలనుకున్నారు. నాణ్యోతలోపించి పనులు చేయడంతో నిర్మించి రెండేళ్లు కాకముందే సమస్యలు వస్తున్నాయి.పెండింగ్ పనులు చేయిస్తాం- సత్యనారాయణ, ఆలయ ఈవో, కురవి రూ.5 కోట్లతో ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా పూర్తి చేయిస్తాం. ప్రాకార మండపం పనులు పూర్తి కాగా ప్రధాన ఆలయంలో పనులు చేయాల్సి ఉండటంతో దానిని రాజగోపురం పక్కనే నిలిపేశాం. వీరభద్రస్వామి సత్రాల పనులు ఆలస్యమయ్యాయి. స్టీల్, సిమెంటు ధరలు పెరగడంతో గుత్తేదారు వదిలేశారు. బంజార సత్రాలు మరుగు దొడ్ల పైపులు లీకేజీ అవుతు న్నాయి. వాటిని మరమ్మతులు చేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా చేస్తాం.

# అల్పాహార పథకంతో.. 1.54 లక్షల మందికి లబ్ధి



కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అక్టోబరు 24 నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహారం పథకం' ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా తమిళనాడు సర్కారు ఆ రాష్ట్రంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీన్ని అమలు చేయనున్న రెండో రాష్ట్రం తెలంగాణే కానుంది. పేద విద్యార్థుల ఆకలి బాధలు దూరం చేసేందుకు ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికి తోడు పోషకాహారం అందించేందుకు అల్పాహారాన్ని అందజేయనున్నారు.'రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు చేపడతాం. పేద విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్న భోజనం, రాగిజావ అందిస్తున్నాం. తాజా నిర్ణయం పేద కుటుంబాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని' ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు.

పేద విద్యార్థులకు ఉపయుక్తం

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 2,587 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 1,54,572 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ తాజా పథకం కింద లబ్ధి చేకూరనుంది. చాలామంది పేద పిల్లలు గ్రామీణ ప్రాంతాల నుంచి ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలలకు వస్తున్నారు. వారు అల్పాహారం తీసుకోవడం లేదు. ఫలితంగా రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలు బాధిస్తున్నాయి. కొందరు తరగతి గదుల్లో నీరసంగా, చదువుపై అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం రాగిజావ అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానీ అందజేస్తోంది. తాజాగా అల్పాహారం అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

# ఆసుపత్రికి వెళ్లాలంటే.. అష్టకష్టాలే..!



చర్ల : మారుమూల కీకారణ్య గ్రామాల ఆదివాసీలకు నేటికీ మౌలిక సదుపాయాలు అందని దౌర్భాగ్యం స్థితిలో ప్రాణాల మీదకు వచ్చినా యాతన తప్పడం లేదు. కనీసం రోడ్డు లేక కీకారణ్య గ్రామాల్లో ఆదివాసీలు ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రోడ్డుకు తీసుకొచ్చేందుకు ఎంతో కష్టపడుతున్నారు. ఇందుకు ఈ ఘటనే నిదర్శనం.. చర్ల మండలం బూరుగుపాడు గ్రామంలోని మడవి భద్రయ్య(50)ను దానవాయిపేట గ్రామానికి చెందిన నర్సింహారావు అనే వ్యక్తి కిరాతకంగా బరిసెతో పొట్టలో పొడిచి పరారయ్యాడని గ్రామస్థులు తెలిపారు. రక్తపు మడుగులో ప్రాణాపాయ స్థితిలో పడివున్న భద్రయ్యను ఆదివాసీలు.. కుటుంబ సభ్యులు మంచాన్ని జెట్టీగా మార్చి అక్కడ నుంచి 3కి.మీ. వరకు నానా అవస్థలు పడుతూ బురదమయంగా ఉన్న రోడ్డులోనే దానవాయిపేట వరకు మోసుకొచ్చారు. అప్పటికే అక్కడకు చేరుకున్న 108లో అతనిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి, అనంతరం కొత్తగూడెం వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. భద్రయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

**పాముకాటుతో ఆదివాసీ యువతి మృతి**

చర్ల మండలంలోని క్రాంతిపురం(రాజయ్య నగర్)కు చెందిన పొడియం జ్యోతి(21)ను పాము కాటేయడంతో మృతి చెందింది. ఇంట్లో మంచంపై పడుకొని నిద్రిస్తున్న జ్యోతిను కట్లపాము కాటేసింది. తననేదో కరుస్తోందంటూ జ్యోతి కేకలు వేయడంతో అక్కడే నిద్రిస్తున్న తండ్రి పొడియం రామయ్య వెళ్లి చూడగా పాము కరుస్తూ కనిపించింది. పామును చంపేసి రహదారి సౌకర్యం సరిగా లేకున్నా చీకట్లోనే జ్యోతిని నానా అవస్థలు పడుతూ సుబ్బంపేట-చర్ల రోడ్డుకు తీసుకువచ్చి అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై చర్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలిస్తుండగా జ్యోతి మార్గమధ్యంలో మృతిచెందింది. అంబులెన్సు రాని దౌర్భాగ్య పరిస్థితుల్లో బతుకుతున్నామంటూ గ్రామ ఆదివాసీలు వాపోతున్నారు.

# ఏమార్చి.. నగదు కాజేసి




ఖమ్మం : నగరంలోని డీసీసీబీ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు ఈనెల 9న పలుమార్లు యత్నించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తులు స్వల్ప వ్యవధిలో చొక్కాలను మార్చి పలుమార్లు ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశించినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వేర్వేరు కార్డులను వినియోగించడంతో అనుమానించి గాంధీచౌక్‌లోని ఓ లాడ్జికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు.హరియాణా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకు ఏటీఎం నుంచి నగదును ఇటీవల డ్రా చేసుకున్నారు. అయినా తమకు నగదు రాలేదని ఫిర్యాదు చేశారు. తిరిగి తమ ఖాతాల్లో జమ చేయించుకుంటున్నారు. వీరు ముఠాగా ఏర్పడి తమ ప్రాంతాలకు చెందిన పలువురి పేరిట ఆయా రాష్ట్రాల్లో ఖాతాలు ప్రారంభించి, రూ.30-40 వేలు జమచేసి ఉంచుతూ.. ఆ కార్డులను ఉపయోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

ప్రజలు నగదు దాచుకునేందుకు, పొదుపు చేసేందుకు, ఆర్థిక అవసరాలు తీర్చేందుకు బ్యాంకులు ఏర్పాటయ్యాయి. నిరంతరం సేవలందించేందుకు ఏటీఎం (ఆటో టెల్లార్ మిషన్)లు అందుబాటులోకి వచ్చాయి. కొన్నిచోట్ల నగదు డిపాజిట్ చేసే యంత్రాలు ఉన్నాయి. వీటిని లక్ష్యంగా చేసుకుని కొందరు చోరీలకు పాల్పడుతున్నారు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హరియాణా నుంచి వచ్చిన ముఠాలు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కార్డు ఉపయోగిస్తూ ఏటీఎం నుంచి నగదు తీసుకుని చివరి క్షణంలో విద్యుత్తు సరఫరా నిలిపేస్తూ.. వేళ్లు అడ్డుపెట్టి లావాదేవీ ఫెయిల్ అని నమోదయ్యేలా చేస్తున్నారు. అలాగే నగదు తీసుకున్నా తమకు రాలేదని ఫిర్యాదు చేసి ఖాతాలో తిరిగి జమచేయించుకుంటున్నారు.

ఉభయ జిల్లాల్లో..

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన ఏటీఎంలు ఖమ్మం జిల్లాలో 237, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 163 ఉన్నాయి. డీసీసీబీ ద్వారా ఖమ్మం, భద్రాద్రి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో 29 ఏటీఎంలు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఒక్కో మొబైల్ ఏటీఎంలు కొనసాగుతున్నాయి.

అపరిచితులను నమ్మి..

ఏటీఎం కేంద్రాల వద్దకు వస్తున్న పలువురు ఖాతాదారులు మోసానికి గురవుతున్నారు. కార్డు వినియోగం తెలియక అపరిచితులను ఆశ్రయిస్తున్నారు. ఈక్రమంలో కొందరు దుండగులు కార్డు మార్చి మాయచేస్తున్నారు. పిన్ తెలుసుకుని తదుపరి తాము నగదు డ్రా చేసుకుంటున్నారు.

బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఖాతాను పునరుద్ధరించాలంటే చరవాణికి వచ్చిన ఓటీపీ చెప్పాలని.. లింక్ క్లిక్ చేయాలని కోరుతున్నారు. ఓటీపీలు చెప్పినా, లింకులను క్లిక్ చేసినా బ్యాంకు ఖాతాల నుంచి నగదు చోరీకి గురవుతుంది.

కార్డుల ద్వారా ఏటీఎంలలో చోరీలు, మోసాలకు పాల్పడిన ఘటనలపై తిరుమలాయపాలెం ఠాణా పరిధిలో 2022లో రెండు కేసులు, 2023లో ఇప్పటివరకు వైరా, వీఎంబంజర, ఖమ్మం ఒకటో పట్టణం, కొణిజర్లలో ఒక్కొక్కటి చొప్పున, తల్లాడలో రెండు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కార్డుతో వినియోగదారులను మోసగించిన కేసులు అనేకం ఉన్నాయి.

ఏటీఎంల వద్ద అపరిచితులకు కార్డు ఇవ్వొద్దు. పిన్, ఓటీపీలు చెప్పొద్దు. అపరిచిత లింకులపై క్లిక్ చేయొద్దు. ఏటీఎంలలో కొన్ని ముఠాలు నగదు తీసుకొని రాలేదని ఫిర్యాదు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. అందుకే సీసీ కెమెరాల పర్యవేక్షణను పటిష్ఠపరిచాం. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే స్పందిస్తున్నాం. నిత్యం ఏటీఎంలలో నగదు లెక్కించి సరిచూసుకుంటున్నాం.

అట్లూరి వీరబాబు, సీఈఓ, డీసీసీబీ

# స్టేడియంలో ఆడేదెప్పుడో?

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మినీ స్టేడియం నిర్మాణ పనులు తొమ్మిదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. సాధన కోసం పట్టణ శివారు ప్రాంతాలను గానీ, జూనియర్ కళాశాల మైదానాన్ని గానీ ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. స్టేడియం పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించిన క్రీడాకారులకు నిరాశ తప్పడం లేదు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ శివారులో అయిదు ఎకరాల విస్తీర్ణంలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.1 కోట్లను మంజూరు చేసింది. 2014 సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ఆగుతూ, సాగుతూ తొమ్మిదేళ్లు అయినా పూర్తి కాలేదు. మొదట వీటిని చేపట్టిన గుత్తేదారు మధ్యలో చేతులెత్తేయడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక నిధులు రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో తిరిగి పనులు మొదలయ్యాయి. క్రీడాకారులకు అవసరమైన విశ్రాంతి, డ్రెస్సింగ్, క్రీడా పరికరాలు భద్రపరిచేందుకు, కార్యాలయం తదితర గదుల్లో ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయి. స్టేడియం చుట్టూ ప్రహరీ పూర్తి చేశారు. విద్యుత్తు వైరింగ్ తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. మైదానంలో మొరం నింపి చదును చేశారు. ఆర్చిగేటు నిర్మాణం, మరికొంత ప్రాంతం మొరం నింపాల్సి ఉంది. ఇండోర్‌గేమ్ భవనం, మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం వంటివి పూర్తి చేయాల్సి ఉంది.



క్రీడా మైదానం లేక అవస్థలు

వేములవాడ పట్టణవాసులు, క్రీడాకారులకు మైదానం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానమే అన్నింటికీ పెద్ద దిక్కుగా మారింది. వర్షం కురిస్తే ఆ మైదానం చెరువును తలపిస్తుంది. దీంతో కళాశాల విద్యార్థులు, పట్టణవాసులకు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. కళాశాల మైదానంలో చాలీచాలని వసతుల మధ్య ఏటా పాఠశాల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మైదానం లేక ఇతర క్రీడల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. కళాశాల పని వేళల్లో క్రీడల నిర్వహణకు అక్కడ అవకాశం లేదు. దీంతో పట్టణ శివారు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి క్రీడాకారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రాంతంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ తదితర క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన వారు చాలా మంది ఉన్నారు. క్రీడా మైదానం అందుబాటులో లేక నైపుణ్యాలను మెరుగుపర్చుకోలేకపోతున్నారు. పట్టణవాసులు నడకకు సైతం మైదానం లేక మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో తిరుగుతున్నారు. ఇప్పటికైనా స్టేడియం నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు, క్రీడాకారులు కోరుతున్నారు.

మరో ఎనిమిది నెలల్లో పూర్తి

నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులు మొదలు పెట్టి మూడు నెలలు అవుతుంది. అగ్రిమెంట్‌లోగా పనులు పూర్తి చేయడం జరుగుతుంది. ఇండోర్ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మైదానంలో సింథటిక్ ట్రాక్, భవనంలో ఫ్లోరింగ్, ఆర్చిగేటు తదితర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపునకు ఇబ్బంది లేదు. పనులు నిలిచిపోవడానికి అవకాశం లేదు. నిర్ణీత గడువులోగా స్టేడియం నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తుంది.

శ్రీకాంత్, ఏఈ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ, వేములవాడ

# అందుబాటులో నిధులు.. ఆసుపత్రుల్లో ప్రజలు

ధర్మారం : 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందాన మారింది ధర్మారం మండలం నందిమేడారం వాసుల దుస్థితి. అందుబాటులో నిధులున్నా వినియోగించుకోలేక, వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో జాప్యం.. పనుల్లో నాణ్యత లేదనే ఫిర్యాదులతో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తుండటం శాపంగా మారింది.

నందిమేడారం పంచాయతీలో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. గ్రామంలోని అంతర్గత రహదారులపై గుంతలు పూడ్చేందు కు.. కాలువలు, ప్రాజెక్టు పనులు చేస్తున్న చోటు నుంచి మట్టి, చూర తెచ్చి పోస్తున్నారు. మండల అధికారులు చెక్కులు పాస్ చేయనందుకే పారిశుద్ధ్య పనులు చేయలేకపోతున్నామని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. పారిశుద్ధ్య లోపంతో దోమలు స్వైర విహారం చేస్తున్నా యి. ప్రజలు విష జ్వరాలు, డెంగీతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

పంచాయతీలో ఎఫ్ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులు రూ.22 లక్షలు, సాధారణ నిధులు రూ.లక్ష నిలువ ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి ముజీబ్ తెలిపారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కొత్త పనులు చేపట్టేందుకు వీలు కావడం లేదని చెప్పారు. అయితే చేసిన పనులు సక్రమంగా లేవని, సమగ్ర పరిశీలన అనంతరమే బిల్లులు చెల్లిస్తామని ఎంపీవో రమేష్ తెలిపారు. పారిశుద్ధ్య లోప నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాణాలు పోతేనే హడావుడి

నందిమేడారం గ్రామానికి చెందిన సిరవేని మైథిలి నెల రోజుల కిందట తీవ్ర జ్వరంతో మృతి చెందింది. ఆ మరుసటి రోజు నుంచి నాలుగైదు రోజులు గ్రామ పంచాయతీ, మండల అధికారులు హడావుడి చేశారు. ప్రభావిత కాలనీలోని ఎస్సారెస్పీ కాలువలో పూడికతీత చేపట్టారు. ఊరిలో నుంచే మరో రెండు ఎస్సారెస్పీ ఉపకాలువలు వెళ్తుండగా వాటిలోనూ పూడిక పేరుకుపోయింది. దీనికితోడు ఎస్సారెస్పీ కాలువల్లోకే మరుగుదొడ్ల పైపులైన్లు కలపడంతో సమస్య తీవ్రమవుతోంది. కాలువల్లో సాగునీటి ప్రవాహం లేకపోగా మరుగుదొడ్ల వినియోగ జలం ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. కాలువలకు ఇరువైపులా ఉన్న కుటుంబాల వారే ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. మేడారంలో కేవలం ఆరుగురే డెంగీ బారిన పడినట్లు వైద్యాధికారులు చెబుతుండగా చాలా మంది బాధితులు ధర్మారం, కరీంనగర్‌లలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

డెంగీ బాధితులకూ స్థానికంగా చికిత్సనందిమేడారం పీహెచ్‌సీలో అన్ని రకాల జ్వర నిర్ధారణ పరీక్షలతో పాటు డెంగీ బాధితులకు చికిత్స అందిస్తున్నామని మండల వైద్యాధికారి డా.అనుదీప్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన వారికి పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేయడం వరకే తమ విధి అని చెప్పారు. డెంగీ బాధితులకు అందిస్తున్న చికిత్సలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డా.అనుదీప్, మండల వైద్యాధికారి

# పడిపోతున్న భూగర్భ జలమట్టం

ఖమ్మం : జిల్లాలో వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలమట్టం దిగజారుతోంది. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో సాగర్ ఆయకట్టుకు సాగునీరు సరఫరా అవుతుండగా వివిధ రకాల పంటలు సాగులో ఉన్నాయి. ఉపరితలంపై సాగునీరు ప్రవహిస్తున్నా భూగర్భ జలమట్టం మాత్రం దిగువకు వెళ్తోంది. ఫిబ్రవరి ముగిసే నాటికి సత్తుపల్లి మండలంలో 2.17 మీటర్ల లోతుకు భూగర్భజలం పడిపోయింది. గతేడాది ఫిబ్రవరితో పోల్చితే 0.34 మీటర్ల లోతుకు తగ్గిపోయింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 954.40 మి.మీ. కాగా 2022 జూన్ నుంచి ఇప్పటివరకు 64 రోజుల్లో 1,057.60 మి.మీ. వర్షం కురిసింది. 10.48 శాతం అధిక వర్షం కురిసినా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే



భూగర్భ జలమట్టం పడిపోతోంది. బోనకల్లు, చింతకాని మండలాల్లో మాత్రం స్వల్పంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన బోర్లు, బావుల్లో 66 ఫీజోమీటర్లను భూగర్భ జలశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. రోజువారీగా భూగర్భ జలమట్టం వివరాలు ఫీజోమీటర్లలో అమర్చిన సెన్సర్లు నమోదు చేస్తాయి. అధికారులు ప్రతినెలా ఈ వివరాలు సేకరించి నివేదిక రూపొందిస్తారు.

# మత్స్య శాఖకు మచ్చలు



ఖమ్మం : మత్స్యకార కుటుంబాలకు అండగా నిలవాల్సిన మత్స్య శాఖ తీరు వివాదాస్పదమవుతోంది. ఖమ్మం జిల్లాలో అధికారులు మొదలు కింది స్థాయి సిబ్బంది వరకూ కొంతమంది వ్యవహార శైలితో శాఖకు అవినీతి మచ్చలు అంటుకుని వదలడం లేదు. ఇటీవల ఏసీబీ సోదాలు, అధికారులు సస్పెన్షన్లకు కారణమైన ఘటనలకు తోడు ఇంకా శాఖలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పూర్వ ఖమ్మం జిల్లాలో మత్స్య శాఖకు వైరా డివిజన్ కీలకం. వైరా జలాశయంలో నిషేధిత సమయంలో చేపల వేటకు అనుమతి ఇచ్చే క్రమంలో సొసైటీ ప్రతినిధుల నుంచి నగదు డిమాండ్ చేసి, వారం క్రితం ఏకంగా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) బుజ్జిబాబు సస్పెండ్ అయ్యారు. కాంట్రాక్టు ఉద్యోగి మురళీని శాశ్వతంగా తొలగించారు. కీలక అధికారి సస్పెండ్ కావడంతో ఇక్కడ ఇన్‌ఛార్జిగా ఏడీని నియమించారు. ప్రస్తుతం వైరా కేంద్రంగా శాఖాపరంగా చేపట్టాల్సిన ముఖ్య కార్యక్రమాలున్నాయి.

అవన్నీ పడకేశాయి..

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలో చేపపిల్లల ఉత్పత్తి చేసే ఏకైక కేంద్రం వైరా. ఏటా మూడు కోట్ల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యం ఉంటుంది. దీంతోపాటు కొరమీను ఉత్పత్తికి రాష్ట్ర స్థాయిలోనే ఇక్కడి కేంద్రాన్ని ఎంపిక చేశారు. గత వర్షాకాల సమయంలో ఇక్కడ కొరమీను చేపపిల్లల ఉత్పత్తి విజయవంతమైందని అధికారులు ప్రకటించారు. కానీ ఎంతమేరకు సత్ఫలితాలు ఇచ్చిందన్న విషయంలో స్పష్టత లేదు. భువనేశ్వర్‌లోని జాతీయ మంచినీటి చేపల ఉత్పత్తి కేంద్రం(సిఫా)తో ఒప్పందం చేసుకుని అక్కడ నుంచి వచ్చిన శాస్త్రవేత్తల సూచనలతో ఈ ఉత్పత్తి చేశారు. రాబోయే వర్షాకాలంలో ఈ ఉత్పత్తి మళ్లీ చేయాలి. దీనికి తోడు సాధారణ బంగారుతీగ, కట్ల, రోహు వంటి చేపపిల్లల ఉత్పత్తి సైతం చేపట్టాల్సి ఉంది. చేపపిల్లల ఉత్పత్తికి ఈసరికే అవసరమైన వసరులు, చేపల తొట్లు, ఇతర ఏర్పాట్లు చేసుకోవాలి. పూర్తి స్థాయిలో దిగుబడి సాధనకు కావాల్సిన కసరత్తు చేపట్టాలి. వైరాలో ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. సిబ్బంది లేకపోవడంతో వసతులు కనుమరుగైనా గాడినపెట్టే వారు లేరు. ముఖ్యమైన అధికారి లేకపోవడంతో పాటు కింది స్థాయి పోస్టులు ఖాళీగా ఉండటంతో పరిస్థితి చక్కబడటం లేదు.

జిల్లాలోనూ అదే తీరు

జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులుగా సభ్యత్వాల నమోదు కోసం మత్స్యకారులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలోనూ భారీ అవకతవకలు, అవినీతిని ప్రోత్సహించే చర్యలకు ఊతమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారు. అనేక మంది సభ్యులు పలు కారణాలతో మృతిచెందగా వారికి శాఖాపరంగా వచ్చే బీమా రాలేదు. ఎందుకు రాలేదో కనీస కారణాలు చెప్పలేకపోతున్నారు.సొసైటీల పరిధిలో ఉన్న చేపల చెరువుల్లో చేపల వేటకు అనుమతి కోసం నగదు డిమాండ్ చేస్తున్నారు. సభ్యత్వాలు ఇచ్చేందుకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇందుకు కూడా నగదు డిమాండ్ చేస్తున్నారు. అంతట ఇదే పరిస్థితి.

తమకు అనుకూలంగా లేకుంటే సభ్యత్వాలకు సంబంధించిన వాటితోపాటు ఇతర ఫైల్సును మూలన వేస్తున్నారు.

అనేక సమస్యలున్నాయి: ఆంజనేయస్వామి, ఏడీమత్స్యశాఖ వరంగా అనేక సమస్యలున్నాయి. ఇటీవల అధికారుల వేటు నేపథ్యంలో మరో అధికారిని ఇవ్వాలని కోరాం. రాబోయే సీజన్‌లో చేపల ఉత్పత్తితో పాటు కొరమీను ఉత్పత్తి కీలకంగా ఉండనుంది. కానీ వసతులు లేవు. గత సీజన్‌లో కొరమీను విజయవంతమైందని చెప్పినా ఏ స్థాయిలో ఉందో స్పష్టత లేదు. ఆరోపణలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యం.. 75 మిలియన్ టన్నులు

వరంగల్ : సింగరేణి సంస్థ వచ్చే ఏడాది భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకుంది. కొత్త గనులకు సంబంధించిన ప్రణాళికలకు సైతం రూపకల్పన చేసుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నులు ఉండగా వచ్చే ఏడాది మరో 5 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని పెంచింది. దానికి అనుగుణంగా ఉత్పత్తి చేపట్టేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు చేసుకుంటోంది. ఏ గనుల నుంచి ఎంత బొగ్గు వెలికి తీయాలన్న అంచనాలను తయారు చేసుకుంటోంది. లక్ష్యాన్ని అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటి నుంచే అధికారులకు సూచనలు చేస్తోంది. సంచాలకుల నుంచి కింది స్థాయి అధికారి వరకు వారి వారి గనులు, ప్రాంతాలకు నిర్దేశించిన ఉత్పత్తిని సాధించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. మరి కొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక



సంవత్సరం ప్రారంభం కానుండటంతో అప్పటి లోగా భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది. వచ్చే ఏడాది సింగరేణి సంస్థ 134 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అదనంగా సాధించనుంది. ఈ ఏడాది కొత్తగా ప్రారంభించుకున్న గనులు వచ్చే ఆర్థిక సంవత్సరం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆ గనుల నుంచి అదనంగా బొగ్గును వెలికి తీసేందుకు ప్రణాళికలు చేసుకుంది. ఇప్పటికే ప్రారంభించిన జీడీకే కోల్‌మైన్స్(జీడీకే-5) ద్వారా ఉత్పత్తి చేస్తుండగా వచ్చే ఏడాది నుంచి అందులో మరింత ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచుకోనుంది. సింగరేణి సంస్థ ఆపై వచ్చే ఏడాది(2024-25)లో మరో రెండు కొత్త గనులు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి అనుమతులతో పాటు భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసే దిశగా ప్రణాళికలు చేసుకుంది. ఆపై వచ్చే ఏడాదిలో ఎంవీకే ఓసీపీతో పాటు తాడిచెర్ల-2 ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. వీటిద్వారా సింగరేణి సంస్థ అదనంగా మరో 10 మిలియన్ టన్నుల బొగ్గును ఏటా ఉత్పత్తి చేయనుంది.

# నిబంధనలు కఠినం.. ముడుపుల భారం

వరంగల్ : భవన నిర్మాణ అనుమతులు, లేఅవుటు అనుమతులు సులభతరం, పారదర్శకం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీఎస్-బీపాస్ అమల్లోకి తెచ్చింది. 2019- కొత్త పురపాలక చట్టంలో పొందుపర్చిన విధంగా లేఅవుటు అనుమతుల జారీ బాధ్యతలు కలెక్టర్లకు అప్పగించినా లంచాలు, మామూళ్లు తగ్గడం లేదు. గ్రేటర్ వరంగల్‌లో ఓ ద్వితీయ అధికారి, కుడా ప్రణాళిక విభాగంలో ద్వితీయ, తృతీయ అధికారులే మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ గంపగుత్తగా స్థిరాస్తి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. అధికారికంగా లేఅవుటు అనుమతి పొందాలంటే ఒక ఎకరానికి అన్ని రకాలైన ఫీజులకు రూ.10 లక్షల వ్యయమవుతుంటే.. ప్రజాప్రతినిధులు, పాలకవర్గం పెద్దలు, కార్పొరేటర్లు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులుకు, ప్రభుత్వ శాఖాధికారులు, ఉద్యోగుల మామూళ్లకు రూ.6లక్షలు ఖర్చవుతోందని స్థిరాస్తి వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

అక్రమ లేఅవుట్లు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. అనుమతులు పొందేందుకు ఇబ్బందులుండటంతో ఎందుకు వచ్చిన తంటా అంటూ మూడో కంటికి తెలియకుండా అనధికార లేఅవుట్లు వైపు సిర్థాస్తి వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. టీఎస్-బీపాస్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి కొత్త లేఅవుట్ల జారీ పదుల సంఖ్యకే పరిమితమయ్యాయి. ఎందుకిలా జరుగుతుందోనని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కఠినతరమైన టీఎస్-బీపాస్ నిబంధనలు, అంతకంటే కష్టంగా మారిన మామూళ్ల బెడద కారణమని వెల్లడైంది. కొత్త లేఅవుటు అనుమతి పొందేందుకు ముందుగా రెవెన్యూ శాఖకు నాలా పేరు మార్పిడి ఫీజు చెల్లించాలి. తర్వాత నగర పరిధిలో గ్రేటర్ వరంగల్, కుడా పరిధిలో అయితే గ్రామ పంచాయతీ, కుడాకు రుసుములు చెల్లించాలి. అన్ని రుసుములు ముందే చెల్లించేసి, అంతర్జాలంలో టీఎస్-బీపాస్ సైటులో దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ శాఖాధికారులు అన్ని పరిశీలించి అనుమతి జారీ చేస్తారు. చివరగా జిల్లా కలెక్టర్ ఆమోదంతో నూతన లేఅవుటుకు డీపీ నంబరు, ప్లాన్ ఇచ్చేస్తారు. లేఅవుటు మొత్తం భూమిలో 10 శాతం ఓపెన్ స్పేస్ కింద వదిలేయాలి. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు స్తంభాలు, ఇతర వసతులు కల్పించడం పెను సవాల్‌గా మారింది. ఇవన్నీ ఎందుకని నగర పరిధిలో చాలామంది అనధికారం వైపు మొగ్గు చూపుతున్నారు.

ఎకరా లేఅవుట్‌కు మామూళ్లు ఇలా..

పాలకవర్గం పెద్దలకు రూ.2 లక్షలు

స్థానిక ప్రజాప్రతినిధికి రూ.లక్ష

స్థానిక కార్పొరేటర్‌కు రూ.లక్ష

అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులకు రూ.2 లక్షలు

ఇవిగో సాక్ష్యాలు

భట్టుపల్లి రోడ్డులో ఓ స్థిరాస్తి వ్యాపారి మూడున్నర ఎకరాలు లేఅవుటు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేటు లైసెన్సు సర్వేయర్ ద్వారా అధికారుల వద్దకెళ్తే కళ్లు చెదిరే విధంగా ఫీజులు, మామూళ్ల పట్టిక వివరించినట్లు తెలిసింది. దీంతో సదరు వ్యాపారి వెనక్కి తగ్గారు. మడికొండ, రాంపూర్ శివారులో మరో ఇద్దరు స్థిరాస్తి వ్యాపారులు మామూళ్ల లెక్క చూసి పరేషానయ్యారు. చివరకు చట్ట సభల ప్రజాప్రతినిధి ద్వారా ముందుకెళ్లినట్లు తెలిసింది. ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని ఓ వ్యాపారి లేఅవుటు అనుమతి పొందేందుకు సిద్ధమయ్యారు. అధికారికంగా అనుమతి పొందినా, మామూళ్లు ఇవ్వాల్సిందేనని స్థానిక కార్పొరేటర్ తెగేసి చెప్పడంతో రియల్టర్ కంగుతిన్నారు. కుడా పరిధిలో చట్ట సభల ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల తీరుతో అనుమతులు తీసుకునేందుకు వ్యాపారులు సాహసించడం లేదు.

# బిల్లులివ్వక భోజనం ఎలా?



సత్తుపల్లి : సకాలంలో బిల్లులు రాకపోవటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అప్పు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. సరకుల ఉద్దెర పెరిగిపోతుండటంతో కిరాణా, కూరగాయల వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం గౌరవ వేతనాలు ప్రకటించినా బకాయి బిల్లుల భారంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నామని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తూ కూరలకు బిల్లులు అందిస్తుంది. ఒకటి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబరు నుంచి నేటి వరకు, రాష్ట్ర ప్రభుత్వం 9, 10 తరగతి విద్యార్థులకు సెప్టెంబరు నుంచి నేటికీ బిల్లులు విడుదల చేయలేదు. గతంలో రూ.వెయ్యి చొప్పున గౌరవ వేతనం ప్రకటించగా అది సక్రమంగా చెల్లించడం లేదు. తాజాగా జీఓ నం.8 ద్వారా మరో రూ.2వేలు కలిపి రూ.3వేల చొప్పున వేతనాలు చెల్లిస్తామని గతేడాదిలో చెప్పగా నేటికీ అమలు కాలేదు.

నిర్వహణ భారం..

ప్రాథమిక స్థాయిలో ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.4.97, ప్రాథమికోన్నత విద్యార్థికి రూ.7.45, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.9.95 చొప్పున కేటాయించింది. గుడ్డుకు మరో రూ.5 అదనంగా ఇస్తుండగా బయట మార్కెట్‌లో అదనంగా రూ.1-2 చెల్లించాల్సి వస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం బియ్యంతోపాటు నిత్యావసరాలు, వంట గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని నిర్వాహకులు వేడుకుంటున్నారు.

“బిల్లుల చెల్లింపులో జాప్యంతో దుకాణాల్లో రూ.1.20లక్షలు అప్పులు చేయాల్సి వచ్చింది. పదహారేళ్లుగా కార్మికురాలిగా పనిచేస్తున్నా. ప్రభుత్వాలెప్పుడు సకాలంలో బిల్లులు విడుదల చేసింది లేదు. నా భర్త కూలీ డబ్బులు కూడా అవసరాలకు వినియోగిస్తున్నా.”

కొత్తపల్లి జరీనా, సత్తుపల్లి

“కొవిడ్ కంటే ముందు రెండేళ్లపాటు ఏజెన్సీలకు బిల్లులు చెల్లించలేదు. మాకు దాదాపు రూ.2లక్షల వరకు రావాల్సి ఉంది. అప్పులు పెట్టిన దుకాణాదారులు నేరుగా స్కూల్‌కి వచ్చి అడగటం ఇబ్బందిగా ఉంది.”

పూచి సీత, సత్తుపల్లి

వారంలో అందిస్తాం..సోమశేఖరశర్మ, డీఈవో, ఖమ్మం

జిల్లాలో 9, 10 తరగతుల విద్యార్థులకు చెల్లించాల్సిన బిల్లులు విడుదల అయ్యాయి. జనవరి, ఫిబ్రవరికి గాను రూ.58,72,288లు విడుదల కాగా వారంలో కార్మికులకు చేరుతాయి. ఒకటో తరగతి నుంచి 8వ తరగతికి సంబంధించిన బిల్లులు కూడా సోమవారం విడుదల అయ్యే అవకాశం ఉంది.

# అక్రమ నిర్మాణాలపై ఆన్‌లైన్ ఫిర్యాదు అస్త్రం

పాల్వంచ : ఇకపై అనుమతుల్లేకుండా నిర్మాణాలు జరిగినా.. చెరువు శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. ఇందుకోసం పురపాలక శాఖ ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. ప్లాట్లు, అక్రమ వెంచర్లు, లేఔట్లపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు వీలుకల్పించారు. ఫిర్యాదులను పరిశీలించి నిర్ణయాలు అమలు చేసేందుకు మూడు దశల్లో బృందాలు ఏర్పాటు చేశారు. మొదటి దశ(ఎల్-1)లో తహసీల్దార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ అధికారితో కూడిన (ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందం ఉంటుంది. ఎల్-2లో పట్టణ ప్రణాళిక అధికారి (కమిషనర్ సహా), ఎల్-3లో సబ్ కలెక్టర్, కలెక్టరుతో కూడిన కమిటీ ఉంటాయి. కమిషనర్ దశలో తీసుకున్న నిర్ణయాన్ని ఉన్నత స్థాయి అధికారుల అనుమతితో అమలు చేస్తారు. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయం పోర్టల్‌ను పర్యవేక్షిస్తోంది. ఉభయ జిల్లాల్లో అనుమతి లేని నిర్మాణాలు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో పోర్టల్ పద్ధతిని బల్దియాలు సద్వినియోగం చేసుకోవాలి. అక్రమ నిర్మాణాలపై సమాచారం ఇచ్చేలా పురవాసులను ప్రోత్సహించటంతోపాటు వారికి తగిన భరోసా ఇవ్వాలి. ఇదీ పరిస్థితిఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పురపాలకాల్లో అనుమతుల్లేని నిర్మాణాలు కోకొల్లలు. భద్రాద్రిలోని నాలుగు పురపాలకాల్లో ఇటీవల జోరుగా సాగుతున్నాయి. టీఎస్-బీపాస్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకునే వీలుంది. అయినా కొందరు పట్టించుకోవడం లేదు. నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తూ ఆదాయానికి గండికొడుతున్నారు. శివారు కాలనీల్లో ఈ పరిస్థితి అధికం. అనుమతి లేనికట్టడాలను కూల్చివేసేందుకు బీపాస్‌లో భాగంగా నాలుగు శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశారు. వారు సొంత పనులకే సమయం చాలడం లేదంటున్నారు. చాలామంది అనుమతి తీసుకుని ఆపై నిర్మాణాలు చేపట్టడంలో నిబంధనలు విస్మరిస్తున్నారు. వీరి విషయంలో కచ్చిత పరిశీలన, తగిన సమయం అవసరం. అసలు అనుమతి లేకుండా నిర్మిస్తే మాత్రం నోటీసు



లేకుండానే కూల్చివేయవచ్చు.ఫిర్యాదు విధానం ఇలా.. పట్టణ పరిధిలో ఏదైనా అక్రమ నిర్మాణం, ఆక్రమణ జరిగితే పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారు పూర్తిపేరు, ఈ-మెయిల్ ఐడీ, నిర్మాణం, లేదా ఆక్రమణ జరిగిన ప్రాంతం పేరు, ఫొటోలు జతచేయాలి. ‘ఎల్-1’ బృందం ఈ ఫిర్యాదును పరిశీలిస్తుంది. చర్యలు తీసుకోదగినదైతే టీపీవోల(ఎల్-2) పరిశీలనకు పంపుతారు. టీపీవోలు వివరాలు పరిశీలించి కమిషనర్‌కు పంపుతారు. నిర్మాణం అక్రమమా? సక్రమమా? ఒకవేళ అక్రమం అయితే జరిమానా విధించాలా? కూల్చివేయాలా అనే నిర్ణయాన్ని తీసుకుంటారు. తిరిగి పరిశీలన, తుది చర్యలు తీసుకోవాలని ఎల్-1కు సిఫార్సు చేస్తారు.ఫిర్యాదును 22 రోజుల వ్యవధిలో పరిష్కరించాలి. ఫిర్యాదుదారు వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతారు.అవగాహన పెంపొందిస్తాం- టి.సత్యనారాయణ, పట్టణ ప్రణాళికాధికారి, పాల్వంచత్వరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్ పురపాలకాల్లో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఎల్-1, ఎల్-2లోని టీపీవోలు, ఇతర సిబ్బందికి శిక్షణ ముగిసింది. త్వరలో ఉన్నతస్థాయి అధికారులకు ఈ కార్యక్రమం చేపడతారు. పురపాలకాల ఆదాయాలకు గండికొడుతున్న అక్రమార్కులపై వేగంగా చర్యలు చేపట్టేందుకు ఈ విధానం తోడ్పడుతుంది. ఇందులో ప్రజల బాధ్యతపైనా అవగాహన కల్పిస్తాం.

# ఆర్థిక సంక్షోభంలో కేయూ

వరంగల్ : రాష్ట్రంలో ఉస్మానియా తర్వాత రెండో పెద్ద విశ్వవిద్యాలయం కాకతీయ. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఉపాధ్యాయ విద్య, ఎంసీఏ, ఎంబీఏ, న్యాయశాస్త్ర కోర్సులతో పాటు పరిశోధక రంగంలో 78 కాంబినేషన్‌లలో కోర్సులను అందిస్తోంది. సుమారు 3 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇంతటి కీర్తి కలిగిన కేయూ గత కొన్నేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాక ఉద్యోగుల వేతనాల చెల్లింపు పెద్ద సమస్యగా మారింది. వేతనాలు, పింఛన్లు క్రమం తప్పకుండా చెల్లించడానికే అధికారులు నానా తంటాలు పడుతున్నారు.

నిరాశపరిచిన కేటాయింపులు

2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో నిధులు పెంచుతుందని ఆశతో ఎదురుచూసిన అధికారులకు నిరాశ ఎదురైంది. కేయూ నిర్వహిస్తున్న కళాశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బంది, పెన్షన్‌దారులకు ఏటా రూ.150 కోట్లు అవసరం పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని కేయూ అధికారులు రూ.154 కోట్లు వేతనాల కోసం మరో రూ.200 కోట్లు అభివృద్ధి పనుల కోసమని పతిపాదనలు పంపారు. ప్రభుత్వం కేవలం రూ.127.55 కోట్లు మాత్రమే కేటాయించింది. అభివృద్ధి పనుల కోసం ఎలాంటి నిధులు ఇవ్వలేదు.

వేతనాలకూ.. తిప్పలే

బడ్జెట్‌లో వేతనాలు, పింఛన్‌లకు సరిపడా నిధులు ఇవ్వకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో వెతుకులాట తప్పడం లేదు. ఒకటోతేదీ వచ్చిందంటే నిధులు ఎలా సమకూర్చాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. అంతర్గత వనరులను సేకరించి వేతనాలను చెల్లించాలంటే తలకు మించిన భారం అవుతోందని ఆర్థిక విభాగం అధికారులు వాపోతున్నారు. ప్రతి నెల రూ.12.83 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి. దూరవిద్యా కేంద్రం, పరీక్షల విభాగం, ప్రవేశాల కార్యాలయం, కళాశాలల ప్రిన్సిపాల్ కార్యాలయాల నుంచి అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిధుల లేమితో నెలనెలా వేతనాలు చెల్లించడం ఆలస్యమవుతోంది.

నిలిచిన అభివృద్ధి పనులు

అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఏ వర్సిటీకి ఎన్ని నిధులు ఇస్తారనేది స్పష్టత లేదు. గతంలో కేయూకు 2020-21లో రూ.200 కోట్లు ప్రకటించినా నయాపైసా విడుదల కాలేదు. ఫలితంగా వసతి గృహాల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన, తరగతి గదుల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటులో ప్రగతి లేదు. అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడం పట్ల అధ్యాపక, విద్యార్థి వర్గాలు పెదవి విరుస్తున్నాయి. ఈ నెలలో కేయూకు నాలుగోసారి న్యాక్ బృందం రానుంది. ఇందుకోసం కేయూ ఉన్నతాధికారులు అంతర్గత నిధులు సేకరించి క్యాంపస్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బృందం వచ్చేలోగా క్యాంపస్‌ను సుందరంగా తీర్చిదిద్దడం కోసం చురుకుగా పనులు చేపట్టారు.

ఇదీ పరిస్థితి వేతనాలు, పెన్షన్‌ల కోసం ప్రతినెలా రూ.12.83 కోట్లు అవసరం

ఏడాదికి అవసరమయ్యే నిధులు రూ.150 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది: 127.55 కోట్లు

ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు మినహాయించి రూ. 3 కోట్లు అదనంగా అవసరం అవుతున్నాయి. వీటి సర్దుబాటు కోసం విద్యార్థులపై, పరిశోధకులపై ఫీజుల భారం వేస్తున్నారు.




# రవి శర్మ నుంచి రంగులు మార్చిన కేటీఎఫ్ చీఫ్ నిజ్జర్..!

తప్పుడు పాస్‌పోర్టుతో ఓ దేశంలో ప్రవేశించడమే నేరం.. అలాంటి నేరం చేసిన వాడిని అటూఇటూ తిప్పి.. మసిపూసి మారేడుకాయ చేసి సిక్కు ఉద్యమ నేతగా కెనడా చెబుతోంది. ట్రూడో చెప్పిన కెనడా పౌరుడు, ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ అధినేత నిజ్జర్‌కు సంబంధించిన కీలక విషయాలు బయటపడుతున్నాయి. దాదాపు 26 ఏళ్ల క్రితం రవిశర్మ పేరిట పాస్‌పోర్టుతో ఓ వ్యక్తి కెనడాలోని టొరంటోలోకి అడుగుపెట్టాడు. సిక్కు వేర్పాటు వాదంతో సంబంధాలు ఉండటంతో భారత్‌లోని పంజాబ్ పోలీసులు తన కుటుంబాన్ని వేధిస్తున్నారని.. అక్రమ అరెస్టు చేస్తున్నారని అతడు ఆరోపించాడు. తనకు శరణు కల్పించాలని కోరాడు. కానీ, అతడు తప్పుడు ఆధారాలు సమర్పించాడని తెలిసి కెనడా ఇమ్మిగ్రేషన్ అధికారులు తిరస్కరించారు. అతడే హర్‌దీప్ సింగ్ నిజ్జర్. ఆ తర్వాత నిజ్జర్ వెంటనే బ్రిటిష్ కొలంబియాకు చెందిన మహిళను వివాహం చేసుకొన్నాడు. ఆమె అతడి ఇమ్మిగ్రేషన్‌ను స్పాన్సర్ చేసింది. ఆ సమయంలో దరఖాస్తు పత్రంలో తనకు ఏ సాయుధ గ్రూపుతోనూ సంబంధం లేదని పేర్కొనడం విశేషం. దీంతోపాటు పెళ్లి పత్రిక, ఫొటోలు సమర్పించాడు. కానీ, కెనడా ఇమ్మిగ్రేషన్ అధికారుల్లో అనుమానం మాత్రం పోలేదు. ఎందుకంటే నిజ్జర్‌ను స్పాన్సర్ చేసిన మహిళే.. అంతకు ముందు ఏడాది మరో పురుషుడి స్పాన్సర్‌తో కెనడాకు చేరుకొంది. దీంతో కెనడాలో శరణు కోసం నిజ్జర్ వివాహం చేసుకున్నట్లు భావించి అతడి దరఖాస్తును తిరస్కరించారు. కెనడాలోకి తప్పుడు వివరాలతో ప్రవేశించిన అతడు ఆశ్రయం కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ తర్వాత అతడు అక్కడి కోర్టుల్లో కూడా అప్పీల్ చేసుకొన్నాడు. కానీ, 2001లో కూడా అక్కడి న్యాయస్థానం అతడి అభ్యర్థనను తిరస్కరించింది. ఆ తర్వత హఠాత్తుగా నిజ్జర్ స్వయంగా కెనడా పౌరుడినని చెబుతూ తిరగడం మొదలుపెట్టాడని ఆ దేశ పత్రిక గ్లోబల్ న్యూస్ కథనంలో పేర్కొంది. నిజ్జర్ హత్య తర్వాత ఆ పత్రిక ఆధారాలతో సహా అతడి వ్యవహారాన్ని ప్రచురించింది.

**మాజీ ముఖ్యమంత్రి హంతకుడితో చట్టాపట్టాల్..** 2001 తర్వాత నిజ్జర్ అక్కడే ప్లంబింగ్ బిజినెస్ మొదలుపెట్టాడు. అదే సమయంలోనే వేర్పాటువాది, బబ్బర్ ఖల్సా నాయకుడు జగ్‌తార్ సింగ్ తారతో పరిచయం పెంచుకొన్నాడు. ఇతడు పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ హత్యలో మాస్టర్ మైండ్‌గా ఉన్నాడు. 2014లో తారను కలుసుకొనేందుకు థాయ్‌లాండ్‌కు నిజ్జర్ వెళ్లాడు. జగ్‌తార్ సింగ్‌ను థాయిలాండ్ నుంచి తప్పించే ప్లాన్‌లో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సమన్వయం చేసుకొనేందుకు యత్నించాడు. ఈక్రమంలో పాక్‌కు వెళ్లాడు. కానీ, వారి పథకం పారలేదు. అప్పటికే పట్టాయాలోని భారత్ ఇంటెలిజెన్స్ బృందాలు చుట్టుముట్టాయి. 2015లో తారను భారత్‌కు తీసుకొచ్చారు.

**పంజాబ్‌లో డ్రగ్స్ బానిసలను చేరదీసి..** తారను రక్షించే ప్లాన్ పారకపోవడంతో అతడు కెనడాకు తిరిగి వెళ్లాడు. అనంతరం అతడు ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్‌కు నాయకత్వం వహించాడు. పంజాబ్‌లో మాదకద్రవ్యాల బానిసలను తమ గ్రూపులో చేర్చుకొన్నాడు. ఆ తర్వాత వీరితో పంజాబ్‌లో లక్షిత హత్యలు చేయించడం మొదలుపెట్టాడు. మన్‌దీప్ సింగ్ అనే కేటీఎఫ్ సభ్యుడి అరెస్టుతో 2014-16 మధ్యలో నిజ్జర్ అరాచకాలు తొలిసారి బయటకు వచ్చాయి. ఆ తర్వాత కొన్నేళ్లుగా అతడు భారత్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. 2020లో భారత్ అతడిని ఉగ్రవాదిగా ప్రకటించి 10 లక్షల రివార్డు ప్రకటించింది. 2021లో కమల్‌దీప్ శర్మ అనే హిందూ పూజారి హత్యలో అతడు కుట్రదారుడిగా తేలింది. ఇటీవల జూన్‌లో కెనడాలో బ్రాంప్టన్‌లో ఇందిరాగాంధీ హత్యను పొగుడుతూ ఏర్పాటు చేసిన 'నగర్ కీర్తన్'లో అతడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. మార్చిలో ఒట్టావలో భారత హైకమిషన్‌లో జరిగిన విధ్వంసంలో కూడా అతడి పాత్ర ఉంది.




ఒట్టావా: ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్‌దీప్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అయితే, ఈ వ్యాఖ్యలకు కొద్ది వారాల ముందే కెనడా.. భారత్‌ను నిందించాలని ప్రయత్నించి భంగపాటుకు గురైనట్లు తెలుస్తోంది. నిజ్జర్ హత్యను బహిరంగంగా ఖండించాలని అమెరికా సహా ఫైవ్‌ఐస్ గ్రూపులోని మిత్రదేశాలను కెనడా కోరిందట. అయితే, అందుకు ఆ దేశాల నుంచి స్పందన కరవైనట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం తాజాగా వెల్లడించింది. హర్‌దీప్ సింగ్ నిజ్జర్ (45).. భారత్‌లో 'మోస్ట్ వాంటెడ్' ఉగ్రవాదుల జాబితాలో ఉన్నాడు. అతడి తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. జూన్ 18న పశ్చిమ కెనడాలోని సర్రే నగరంలో ఒక గురుద్వారా వెలుపల ఇద్దరు దుండగులు అతడిని కాల్చి చంపారు. అయితే, ఈ హత్య వెనుక భారత ఏజెన్సీల పాత్ర ఉందని భావించిన కెనడా.. జీ20 సదస్సుకు కొద్ది వారాల ముందు దిల్లీపై నిందలు మోపాలని ప్రయత్నించినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. భారత్ తీరును ఖండించేందుకు అమెరికా సహా మిత్రదేశాలు కలిసి రావాలని కోరినట్లు తెలుస్తోంది. జీ20 సదస్సుకు కొద్ది వారాల ముందు ఫైవ్‌ఐస్ ఇంటెలిజెన్స్ అలయన్స్ సీనియర్ అధికారులతో కెనడా రహస్యంగా చర్చలు జరిపినట్లు సదరు మీడియా కథనం వెల్లడించింది. ఈ అలయన్స్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, కెనడా సభ్యదేశాలుగా ఉన్నాయి. నిజ్జర్ హత్యను బహిరంగంగా ఖండించాలని కెనడా.. ఆ దేశాలను కోరినట్లు తెలిపింది. అయితే, కెనడా వినతిని ఆ దేశాలు తిరస్కరించాయి. ఈ హత్య విషయాన్ని బహిరంగంగా లేవనెత్తేందుకు నిరాకరించినట్లు ఆ కథనం పేర్కొంది.

ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన జీ20 సదస్సుకు హాజరైన కెనడా.. భారత్ సహా మిత్రదేశాల అధినేతలతో కూడా అంటీముట్టనట్లుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జీ20 సదస్సు ముగిసిన వారం రోజుల తర్వాత భారత్‌పై ట్రూడో తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేగాక, భారత్ ఉగ్రవాదిగా ప్రకటించిన నిజ్జర్‌ను.. తమ దేశ పౌరుడిగా ట్రూడో పేర్కొనడం గమనార్హం.

# చేసిన తప్పిదాలకు జగన్ జన్మజన్మలకూ బాధపడతారు: చినరాజప్ప



రాజమహేంద్రవరం: అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెదేపా ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. జూమ్ ద్వారా తెదేపా శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. అక్రమాలేమీ జరగని కేసులో తెదేపా అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని.. దీన్ని బట్టి వ్యవస్థల్ని ఎలా మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతోందన్నారు. 2004 నుంచి జగన్ చేసిన అక్రమార్జనపై సభలో వాస్తవాలు చెబుతామన్నారు. చేసిన తప్పిదాలకు జగన్ జన్మజన్మలకూ బాధపడతారని చినరాజప్ప వ్యాఖ్యానించారు. సొంత డబ్బా కొట్టుకునేందుకు జగన్ అసెంబ్లీ సమావేశాలు పెట్టారని.. ప్రజల పక్షాన పోరాటంతో పాటు చంద్రబాబు అరెస్ట్ అక్రమమనే ప్రధాన అజెండాతో తాము హాజరవుతున్నట్లు చెప్పారు.

# చంద్రబాబు బెయిల్‌పై రఘురామ కీలక వ్యాఖ్యలు




ఢిల్లీ: చంద్రబాబుకు గురువారం కోర్టులో రిలీఫ్ వస్తుందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని సి ఓటర్ సర్వే స్పష్టంగా చెప్పింది. మా వాళ్లకు గుండెల్లో దడ పుడుతోంది. చంద్రబాబు అరెస్ట్‌తో అమెరికా, ఢిల్లీ, కర్ణాటక, చెన్నైలో సహితం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ లేకుంటే దేశం ఇంకా ఎక్కువ అభివృద్ధి చెందేదని విజయసాయిరెడ్డి పార్లమెంట్ మాట్లాడుతున్నారు. సాయిరెడ్డి అన్నం తింటున్నారా?, ఇంకా ఏమైనా తింటున్నారా..?, సిగ్గు లేకుండా విజయసాయి రెడ్డి మాట్లాడుతున్నారు. రాజశేఖర్ రెడ్డి అదే పార్టీలో సీఎం అయ్యారు కదా? సాయిరెడ్డి వ్యాఖ్యలతో రాజశేఖర్ రెడ్డి అభిమానులు నొచ్చుకుంటారు. పార్లమెంట్‌లో లోకేష్ సేవ్ డెమోక్రసీ పేరిట నిరసన తెలిపారు. మద్యంలో రూ.300 కోట్ల రూపాయలు తాడేపల్లి వెళ్తుందని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. పురందేశ్వరి వచ్చాక మా పార్టీ నేతల పప్పులు ఉడకడం లేదు. పురందేశ్వరి ప్రధాని అపాయింట్మెంట్ తీసుకొని మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలని కోరాలి." అని ఈ మేరకు ఆమెకు విజ్ఞప్తి చేశారు.

**సీఎం.. వైజాగ్ వెళ్లినంతమాత్రాన రాజధాని అవ్వదు..** "విశాఖ రుషికొండపై సీఎం జగన్ కొంప కట్టుకున్నారు. మూడు నెలలు మాత్రమే ఉంటారు. జగన్ విశాఖ వెళ్ళినంత మాత్రాన రాజధాని అవ్వదు. తిరుమలలో జగన్ నెత్తిపై అక్షింతలు వేస్తే కూడా దులుపుకుంటారా?, అంత అవమానించడం అవసరమా? మా మనోభావాలు కాపాడండి." అని కోరారు.

# నాపై 15 కేసులు పెట్టారు




కృష్ణా జిల్లా: వైసీపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్న పాత్రుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ తనపై 15 కేసులు పెట్టారని.. మాట్లాడితే వైసీపీ నాయకులు జోకులు వేస్తున్నారని అన్నారు. యువగళం పాదయాత్ర సభలో ఆర్కే రోజా ని రింగులు రాణి అంటే బూతులా? అని ప్రశ్నించారు. సీఎం జగన్మోహన్ రెడ్డిని ఈ ప్రజలే రాజకీయ సమాధి చేస్తారని.. ఆరు నెలల్లో జగన్ పతనం ఖాయమని అన్నారు. మన దేశ సంపద దోచుకుంటున్నారని... బ్రిటిష్ వాళ్ళను మనం తరిమికొట్టామని, మరి రాష్ట్రాన్ని దోచుకుంటున్న ఈ జగన్మోహన్ రెడ్డిని ఏం చేయాలని ప్రశ్నించారు. వైజాగ్ ఎయిర్ పోర్టులో తనను అరెస్ట్ చేశారని.. 50 కిలోమీటర్లు తీసుకొచ్చి తరువాత దిగి వెళ్లిపోమన్నారని అయ్యన్న పాత్రుడు అన్నారు. అయితే "నేను దిగను మీ ఇష్టం ఎక్కడికైనా తీసుకెళ్లాలని పోలీసులకు చెప్పాను.... పోలీసులు తెల్ల మొహం పెట్టి నోటీస్ చేతులో పెట్టి రోడ్డు మీద నన్ను వదిలేసి వెళ్లారు"... అని అన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఏ ముహూర్తంలో పెట్టేరోగాని దాన్ని ఎవరు కదపలేరన్నారు. ఢిల్లీలో నారా లోకేష్‌ను కలిసానని, భయపడే ప్రసక్తే లేదని, యువగళం పాదయాత్ర బ్రాహ్మణి చేస్తుందని చెప్పారన్నారు. విదేశాల నుంచి టీడీపీకి చాలా మంచి స్పందన వస్తోందని, రాజశేఖర్ రెడ్డి సమాధి ఉన్న ఇడుపులపాయలో ట్రిబుల్ ఐటీలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టామని అయ్యన్న పాత్రుడు స్పష్టం చేశారు.

# కృష్ణా ట్రైబ్యునల్‌లో ఏపీ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ




అమరావతి: కృష్ణా ట్రెబ్యునల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఏపీ దాఖలు చేసిన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్‌ను ట్రెబ్యునల్ తోసిపుచ్చింది. తెలంగాణ 90 టీఎంసీల నీరు వాడకుండా ఆపాలని ఏపీ ప్రభుత్వం ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసింది. దీన్ని విచారించే అధికారం తమకు లేదని.. ఇందుకు తగిన వేదికలను ఆశ్రయించాలని ట్రెబ్యునల్ ఏపీ ప్రభుత్వానికి సూచించింది.




# తెలుగు ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారు : వెంకయ్యనాయుడు



హైదరాబాద్: అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అన్నపూర్ణ స్టూడియోస్‌లో నాగేశ్వరరావు విగ్రహాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు. "నాకు నాగేశ్వరరావు అంటే చాలా అభిమానం. ఈ విగ్రహంలో జీవకళ ఉట్టిపడుతోంది. ఆయనే నిల్చున్నారా అనేలా ఉంది. ఏఎన్నార్ మహానటుడు. అలాగే గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహా మనిషి. నేను, ఆయన అనేక విషయాలపై మాట్లాడుకునే వాళ్లం. ఆయన జీవితమంతా నటిస్తూనే ఉన్నారు. ఆఖరి రోజు వరకూ నటించిన నటుడు నాకు తెలిసి మరొకరు లేరు. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావు. ఆయన చూపిన మార్గంలో ప్రయాణించడం ఆయనకు మనమిచ్చే నివాళి. ఆయన భాష, వేషం, వ్యక్తిత్వం వీటిలో కొంతైనా మనం అందిపుచ్చుకోవాలి. ఇక వాళ్ల కుటుంబమంతా తెలుగులో మాట్లాడడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు కనుమరుగవుతుందేమోనని భయం పుడుతుంది. పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. తెలుగంటే ఏఎన్నార్‌కు చాలా అభిమానం. భాషపోతే శ్వాస పోతుంది. శ్వాస పోతే అంతా పోతుంది. అందుకే మన భాషను ఎప్పటికీ మర్చిపోకూడదు. అందరూ తెలుగులో మాట్లాడుకోవాలి". "తెలుగు సినీరంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు. నాగేశ్వరరావు తన జీవితానికి ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకునే వారు. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. ఆయన ఒక నట విశ్వ విద్యాలయం. తెలుగు ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారు. ఆయన జీవితాన్ని చదివారు. జీవితంతో ఆయన పోరాటం చేశారు. దాన్ని ప్రేమించారు. ఆస్వాదించారు. జీవితంలో తాను నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి చూపించారు. దీన్ని మనం అలవాటు చేసుకుంటే అదే ఆయనకు మనం ఇచ్చే నివాళి. ఆయనెప్పుడూ పోరాడి ఓడిపోలేదు. ఆత్మ విశ్వాసం, జీవిత విలువలు తెలుసుకున్నారు. నేటి యువత కూడా వీటిని తెలుసుకోవాలి. ఆయన్ని నటుడిగా ఆరాధించడమే కాదు.. ఆయన జీవితం నుంచి స్ఫూర్తిపొందాల్సింది ఎంతో ఉందని నా అభిప్రాయం. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకున్నారు. సాంఘిక పాత్రల్లో ఆయనకు ఆయనే సాటి. ఆయన ప్రతి సినిమాలో సందేశం ఉండేది. ఈ మధ్య సినిమాల్లో వాడుతున్న భాష బాగుండటం లేదు. డబుల్ మీనింగ్ వచ్చేలా పదాలు వాడుతున్నారు. రాజకీయం కన్నా సినిమా ప్రభావం ప్రజలపై ఎక్కువ. అక్కినేని స్ఫూర్తితో మంచి లక్షణాలను అలవరుచుకొని తర్వాత తరానికి కూడా నేర్పించాలి. ఈ విగ్రహాన్ని ఆవిష్కరించే గౌరవం నాకు కల్పించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని వెంకయ్యనాయుడు అన్నారు.




దిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో బుధవారం చర్చ కొనసాగుతోంది. కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ దీనిపై చర్చను మొదలుపెట్టి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ నారీ శక్తి వందన్ అధినియమ్ 2023 బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆమె తెలిపారు. "మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ సమర్థిస్తోంది. ఇది నాకు చాలా ఉద్వేగభరిత క్షణం. ఈ బిల్లును తీసుకురావడంతో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్వప్నం పూర్తిగా నెరవేరింది. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని నా భర్త రాజీవ్ గాంధీ ఆనాడు రాజ్యసభలో బిల్లు తీసుకొచ్చారు. కానీ, అది రాజ్యసభలో 7 ఓట్ల తేడాతో వీగిపోయింది. ఆ తర్వాత మాజీ ప్రధాని పీవీ నరసింహరావు హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్లును అమల్లోకి తీసుకురాగలిగింది. దాని ఫలితమే, స్థానిక సంస్థల్లో ఇప్పటివరకు దాదాపు 15 లక్షల మంది మహిళలు ప్రాతినిధ్యం వహించగలిగారు" అని సోనియా గాంధీ తెలిపారు. "ఈ బిల్లు ఆమోదం పొందాలని మేం ఆకాంక్షిస్తున్నాం. అయితే, కొన్ని ఆందోళనలు కూడా ఉన్నాయి. మహిళలు రాజకీయ బాధ్యతలు చేపట్టాలని గత 13 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇంకా ఎంతకాలం వేచిచూడాలి? ఈ బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకురావాలి. ఆలస్యమైతే మహిళలకు అన్యాయం జరుగుతుంది. ఈ కోటాలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి. చట్టం సమర్థ అమలుకు తక్షణమే కులగణన చేపట్టాలి" అని సోనియా గాంధీ కోరారు.

# పోలీసులు వైసీపీ కండువాలు కప్పుకుని ఉద్యోగాలు చేస్తున్నారు



విశాఖ : తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో నిరసన దీక్ష జరిగింది. బాబు వెంటే తామున్నామంటూ ప్లకార్డుల ప్రదర్శన జరిగింది. పోస్ట్ కార్డు ఉద్యమం మూడోరోజు సైతం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ బాబు మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలను ప్రపంచమంతా చూస్తోందన్నారు. తమ నాయకుడి క్షేమం కోసం ఆలయానికి వెళ్ళకుండా పోలీసులు అడ్డుపడి అరెస్టులు చేశారన్నారు. పోలీసులు వైసీపీ కండువాలు కప్పుకుని ఉద్యోగాలు చేస్తున్నారని విమర్శించారు. రాక్షస పాలనకు ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలని రామకృష్ణబాబు ప్రశ్నించారు.

# సమంత గారు.. ఇదేమైనా బాగుందా?

ప్రస్తుతం సోషల్మీడియాలో టాలీవుడ్ నుంచి ఫుల్ ట్రెండ్ అవుతున్న విషయాల్లో సమంత సినిమాలకు బ్రేక్ మ్యాటర్ ఒకటి. 'శాకుంతలం' డిజాస్టర్ తర్వాత 'ఖుషి' ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్సిరీస్ షూటింగ్లతో బిజీగా గడుపుతన్న సామ్.. తన అభిమానులకు సినీ ప్రియులకు షాక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఆమె ఈ చిత్రాలు పూర్తైన తర్వాత ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ ఇవ్వనున్నట్లు ప్రస్తుతం జోరుగా ప్రచారం సాగుతోంది. పూర్తిగా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అందుకు అవసరమైన పూర్తిస్థాయి చికిత్స తీసుకోవడం కోసం.. ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతా బాగానే ఉంది కానీ..



ఇక్కడ మరో విషయం ఏంటంటే.. సమంత పూర్తి చేయబోయే సినిమాల ప్రమోషన్స్ గురించి. సాధారణంగా ప్రమోషన్స్ అంటే చిత్రబృందమంతా వరుస ఇంటర్వ్యూలు లేదా స్పెషల్ ఈవెంట్లు ప్లాన్ చేస్తూ ఖాళీ లేకుండా తిరుగుతూ ఉంటుంది. కానీ.. ఎంత మంది ప్రమోషన్స్లో పాల్గొన్నా మెయిన్ అట్రాక్షన్ మాత్రం హీరోహీరోయిన్లే. కొన్ని సందర్భాల్లో వారితో పాటు చిత్రంలో నటించే ఇతర స్టార్ యాక్టర్స్. అయితే ఇప్పుడు ఖుషిసిటాడెల్ ప్రమోషన్స్ విషయానికొస్తే.. ఖుషి సినిమా సెప్టెంబరు 1న రిలీజ్ కానుంది. అంటే ఈ చిత్రానికి కనీసం నెల రోజుల ముందు నుంచి ప్రమోషన్స్ చేయాల్సి వస్తుంది. అయితే ఈ సినిమాకు హీరో విజయ్ దేవరకొండ ఎంత స్పెషల్ అట్రాక్షనో హీరోయిన్ సమంత కూడా అంతే మెయిన్ అట్రాక్షన్. కాబట్టి ప్రమోషన్స్ తప్పనిసరిగా సమంత అందుబాటులో ఉండాల్సిందే. గతంలో శాకుంతలంలో ప్రమోషన్స్లో మయోసైటిస్తో బాధపడుతున్నప్పటికీ వరుస ఇంటర్వ్యూలు ఇచ్చింది. పలు సందర్భాల్లో తన కష్టాలను చెప్పుకుని కన్నీరు కూడా పెట్టింది. కానీ చాలా మంది దాన్ని ట్రోల్ చేశారు. సానుభూతి కోసం ఇలా చేస్తుందని అన్నారు. మళ్లీ ఇప్పుడు కూడా 'ఖుషి' కోసం పాల్గొంటే ఇలానే చేసే అవకాశాలు ఉన్నాయి. ఇది అయిపోతే సిటాడెల్. ఈ సిరీస్ను అమెజాన్ ప్రైమ్.. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్యలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తోంది. దీని కోసం భారీ ఎత్తున ప్రమోషన్లు చేయాలని సన్నాహాలు చేస్తోందని తెలిసింది. అసలే ఆ సిరీస్కు మెయిన్ అట్రాక్షన్ సమంతానే. కాబట్టి ఈ ప్రమోషన్స్లో ఆమె 'ఖుషి' కన్నా ఎక్కువగా జోరుగా పాల్గొనాల్సి ఉంటుంది. కాబట్టి ఆమెకు అస్సలు ఖాళీ ఉండదు.

అంటే మొత్తంగా చూస్తే ఆమె ఈ ఏడాది ఖాళీగా ఉండకపోవచ్చు. వచ్చే ఏడాది ఆమె బ్రేక్ తీసుకుంటుందనమాట. ఇకపోతే.. ఆ మధ్యలో పెట్టుకున్న కొత్త కమిట్ మెంట్ల కోసం తీసుకున్న అడ్వాన్సులను కూడా ఆమె తిరిగి ఇచ్చేసినట్లు తెలిసింది.

# నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే

ఇష్టం సినిమా తో హీరోయిన్ గా రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రియ శరణ్ స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో పుష్కర కాలం పాటు స్టార్ హీరోయిన్ గా వెలుగు వెలిగిన విషయం తెల్సిందే. ఇప్పుడు కూడా సినిమా ల్లో అడపాదడపా సినిమాలు చేస్తూ సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. పెళ్లి అయ్యి తల్లి గా కూడా మారిన శ్రియ అందం విషయంలో మాత్రం పదేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. కొన్ని సార్లు ఇలాంటి హాట్ హాట్ కాస్ట్యూమ్స్ ధరించిన సమయంలో అంతకు మించి ఉ



న్నట్లు కనిపిస్తుంది. తాజాగా శ్రియ ఈ ఫొటోలు షేర్ చేసి క్లీ వేజ్ షో తో మతి పోగొడుతుంది. అందానికి వయసుతో సంబంధం ఏంటి అన్నట్టుగా ముద్దుగుమ్మ శ్రియ శరణ్ అందాల ఆరబోత చేస్తూ నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే అన్నట్లుగా దూసుకు పోతుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు ఈ అమ్మడి యొక్క స్కిన్ టోన్ చాలా స్పెషల్ అంటూ అభిమానులు తెగ కామెంట్స్ చేస్తూ ఈ ఫొటోలను లైక్ చేస్తున్నారు. సిల్వర్ డ్రెస్ లో నడుము నాభి అందాన్ని చూపిస్తూ... క్లీ వేజ్ షో తో జీరో సైజ్ అందాన్ని చూపిస్తూ శ్రియ శరన్ పిచెక్కిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేశారు.

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల విందు ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది.




# ఇండియన్ సినిమా పరువు తీసింది.. బాయ్ కాట్ పీసీ




సాధారణంగా ఇండియన్ ఫిల్మ్ స్టార్స్ కి హాలీవుడ్ లో ఆఫర్లు చాలా తక్కువగా వస్తూ ఉంటాయి. ఒకటి రెండు సినిమాలు లేదా సిరీస్ లు చేసినా కూడా గొప్పే. కానీ ప్రియాంక చోప్రా వరుసగా హాలీవుడ్ లో సినిమాలు సిరీస్ ల్లో నటిస్తూ గ్లోబల్ స్టార్ గా గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే. ఇటీవల ప్రియాంక చోప్రా నటించిన సిటాడెల్ సిరీస్ కి మంచి స్పందన లభించింది.

ప్రపంచ వ్యాప్తంగా సిటాడెల్ సిరీస్ కి వస్తున్న ఆదరణ నేపథ్యంలో ఆమె పై మరింతగా అభిమానం చూపిస్తున్న వారు ఉన్నారు. అయితే ఇదే సమయంలో ఆమె పాత వీడియో ఒకటి వైరల్ అవ్వడంతో ఆమెను తీవ్రంగా విమర్శిస్తున్న వారు కూడా ఉన్నారు. 2016 సంవత్సరంలో జరిగిన ఎమ్మీ అవార్డ్స్ వేడుకలో ప్రియాంక చోప్రా హాజరు అయ్యింది. అంతర్జాతీయ వేదికపై ప్రతిష్టాత్మక అవార్డు వేడుకలో పాల్గొన్న ప్రియాంక చోప్రా ఇండియన్ సినిమా గురించి స్పందించాల్సిందిగా కోరిన సమయంలో... ఇండియన్ సినిమా ల్లో హిప్స్ అండ్ బి... బిస్ గురించే ఉంటుంది. హీరోయిన్స్ వాటిని చూపిస్తే చాలు అన్నట్లుగా ఒక అభిప్రాయం ఉందని సిల్లీగా డాన్స్ చేస్తూ మరీ చెత్తగా మాట్లాడింది. ఇండియన్ సినిమా పరువు తీసే విధంగా ప్రియాంక చోప్రా మాట్లాడింది అంటూ విమర్శలు గుప్పిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇండియన్ సినిమా గురించి అవమానకరంగా మాట్లాడినందుకు గాను ప్రియాంక చోప్రా ఇండియన్ సినీ ఇండస్ట్రీ నుండి బ్యాన్ చేయాలంటూ కొందరు డిమాండ్ చేస్తున్నారు. పాత వీడియో అయినా కూడా ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. మరి ఈ వీడియోలోని తన వ్యాఖ్యలపై ప్రియాంక చోప్రా ఎలా స్పందిస్తుంది అనేది చూడాలి.

# ఆ నలుగురు అన్నట్లు...ఇండస్ట్రీలో ఇప్పుడీ నలుగురు!



దక్షిణాది చిత్ర పరిశ్రమలో నయనతార.. త్రిష.. తమన్నా.. కాజల్ అగర్వాల్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. దశాబ్దాలగా పరిశ్రమలో కొనసాగుతున్నారు. తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు దక్కించుకుని వెలిగిపోతున్నారు. పోటీగా ఎంత మంది భామలొచ్చినా? వాళ్ల స్థానం మాత్రం చెక్కు చెదరనది. ఇంకా చెప్పాలంటే నేటి తరం నాయికలకు ఈ నలుగురు ఓ ఇనిస్పేరషన్. కొత్తగా వస్తోన్న భామలు మీకు ఏ హీరోయిన్ అంటే ఇష్టం? ఏ నటి స్ఫూర్తితో ఇక్కడి వరకూ రాగలిగారు? అంటే త్రిష..తమన్నా.. నయనతార ..కాజల్ పేర్లు చెబుతున్నారు. సాధారణంగా 40 ఏళ్లకు చేరువలో సౌత్ ఇండస్ట్రీలో రాణించడం అంత చిన్న విషయం కాదు. ఎందుకంటే ఇక్కడి పరిశ్రమలు ఎప్పటికప్పుడు కొత్త నీరు కోరుకుంటాయి. కొత్తగా ఎవరొచ్చినా స్వాగతించే అభిమానం ఇక్కడి వాళ్ల సొంతం. అయితే అలవాటైన హీరోయిన్లను అంత సులభంగా వదులుకోరు. లా కొన్ని కొలమానాలు ఆ నలుగురు భామలకి కలిసొచ్చాయి. నయనతారని బాలీవుడ్ బాద్ షా ఏరికోరి మరీ 'జవాన్' సినిమాలో తీసుకున్నాడు. ఏం బాలీవుడ్ హీరోయిన్లు లేక? నయనతారని మించిన అందగత్తెలు లేక! ఇక అందాల త్రిషకి ఇప్పటికీ తెలుగు లో అవకాశాలు క్యూలో ఉన్నాయి. ఆమె తిరస్కరించడం తప్ప! టాలీవుడ్ ఏనాడు ఆ భామని తిరస్కరించలేదు. తాజాగా మరోసారి మెగాస్టార్ చిరంజీవి తో రొమాన్స్ చేయబోతుందన్న వార్తలు హీటెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ 'పొన్నియన్ సెల్వన్' లోనూ నటించింది. ఇక చందమామ కాజల్ అగర్వాల్ ఓ బిడ్డకు తల్లైనా అదే దూకుడు చూపిస్తోంది.

'భగవంత్ కేసరి' సహా లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుం టోంది. సుదీర్ఘమైన తన కెరియర్ లో ఇప్పటికే 59 సినిమాలను పూర్తిచేసింది. 60వ సినిమాగా 'సత్యభామ' చేస్తోంది. అలాగే మిల్కీబ్యూటీ తమన్నా సైతం అదే దూకుడు ప్రదర్శిస్తోంది. సీనియర్ స్టార్స్ తో ఛాన్సులు అందుకుంటూనే వెబ్ సిరీస్ ల్లోనూ తన ట్యాలెంట్ చూపిస్తోంది.

# ఇస్మార్ట్ బ్యూటీ క్యూట్ అందాల ఆరబోత

సుధీర్ బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా ఈ అమ్మడు మొదటి సినిమా తోనే కమర్షియల్ గా సక్సెస్ ను దక్కించుకుంది. అంతే కాకుండా ఒక మంచి హీరోయిన్ ఇండస్ట్రీకి దక్కింది అంటూ మీడియా సర్కిల్స్ మరియు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరిగేలా చేసింది. రామ్ హీరోగా పూరి దర్శకత్వంలో రూపొందిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో హీరోయిన్ గా నటించిన నభా నటేష్ ఓ భారీ కమర్షియల్ సక్సెస్ ను



దక్కించుకుంది. కానీ ఆ వెంటనే కరోనా కారణంగా ఈమె కు ఆశించిన స్థాయి లో ఆఫర్లు రాలేదు. ప్రస్తుతం ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు కొత్త సినిమాలకు కమిట్ అయిన దాఖలాలు కనిపించడం లేదు. సినిమాల్లో నటించకున్నా కూడా సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలు మరియు వీడియోల కారణంగా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంది.

అందాల ముద్దుగుమ్మ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ మరో సారి తన క్యూట్ అందాల ప్రదర్శన చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నభా నటేష్ స్కిన్ షో చేసినా... నార్మల్ గా ఉన్నా కూడా అభిమానులు మరియు ప్రేక్షకులు సర్ ప్రైజింగ్ గా ఆమె ఫోటోలను తెగ షేర్ చేస్తూ ఉన్నారు. ఈ ఫోటోల్లో పెద్దగా స్కిన్ షో లేకున్నా కూడా క్యూట్ గా అందంగా కూల్ గా ఉందంటూ కామెంట్స్ చేస్తూ ఫోటోలను తెగ షేర్ చేస్తున్నారు.

# కాజల్ బ్యూటీ సీక్రెట్ పప్పు అన్నమా?

చందమామ కాజల్ అగర్వాల్ బ్యూటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు పెళ్లి చేసుకుని ఓ బిడ్డకు తల్లైనా! అదే బ్యూటీతో ఆకట్టుకుంటుంది. నవ నాయికలా అవకాశాలు అందుకోవడంలోనూ దూకుడు చూపిస్తుంది. యూత్ లో క్రేజీ భామగా దూసుకుపోతుంది. మరి ఈ బ్యూటీ వెనుక సీక్రెట్ ఏంటి? అందరా జిమ్ కి వెళ్లడం..24 గంటలు నీళ్లు తాగడం! మితంగా తినడం వంటివి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. కాజల్ బ్యూటీ లెక్క ఇక్కడ వేరే ఉంది. ఉదయాన్ని చిన్న పాటి ఎక్సరసైజులు ముగించిన తర్వాత ఉడకబెట్టిన గుడ్డు తింటుందిట. దాంతో పాటు ఒకొ జొన్న రొట్టె కర్రీతో పాటు తీసుకుంటుందిట. ఇక మధ్నాహ్నం లంచ్ లో...రాత్రి డిన్నర్ లో కచ్చితంగా పప్పు ఉండాల్సిందేనట. రెండు పూటలు రైస్ తప్పకుండా పప్పుతోనే తింటుందిట. ఇంట్లో ఉన్నా..సినిమా సెట్స్ లో ఉన్నా? ఆ రెండు పూటలు పప్పు ఉండాలని ముందే చెబుతుందిట. పప్పు చాలా



ఇష్టంగా తింటుందిట. సాయత్రం పూట శాండ్ వించ్ తింటుందిట. కానీ నాన్ వెజ్ మాత్రం ముట్టుకోదటు. దాని వాసన కూడా పడదంట. పూర్తిగా శాఖాహారిని అంటోంది. అప్పుడప్పుడు అన్నంలోకి రాజ్మా చావల్ తీసుకుంటుందిట. పన్నీరు కూడా ఎంతో ఇష్టంగా తింటుందిట. దీని వల్ల ఫ్యాట్ ఫామ్ అవుతుందని తెలిసినా తింటుందిట. అలాగే ప్రతీ రోజు ప్రోటీన్ షేక్స్..కొబ్బరి నీళ్లు తాగుతుంటా. చీట్ మీల్ డే రోజు మాత్రం అమ్మ చేసే పరోటాలు కనీసం పదైనా లాంగించాల్సిందే అంటోంది. అలాగే అమ్మడు మంచి మ్యూజిక్ ప్రియురాలు అట. ఇళయరాజా పాటలు ఎక్కువగా వింటుందిట. మణిరత్నం సినిమాలు అప్పుడప్పుడు చూస్తుందిట. పుస్తకాలు కూడా బాగానే చదువుతుందిట. రీడింగ్ హ్యాబిట్ చిన్నప్పటి నుంచి ఉందిట. ఆయన్ రౌండ్ రాసిన ఫౌంటెన్ హెడ్ పుస్తకం ఎంతో ఇష్టంగా చదువుతుందిట. ఇక అమ్మడు నటిగా ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. తెలుగులో మూడు సినిమాలు చేస్తోంది. అలాగే ఇండియన్ -2లోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే.



## కనీసం వేతనం కోసం కదం తొక్కిన అంగన్ వాడీలు

హైదరాబాద్: తెలంగాణలో కనీసం వేతనం కోసం అంగన్ వాడీలు కదం తొక్కారు. తెలంగాణ వ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించారు. పలు జిల్లాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అంగన్ వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపడంలేదని అంగన్ వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ముట్టడికి పెద్దఎత్తున తరలి వచ్చారు. గతంలో 1వ తేదీన జీతాలు వచ్చేవని.. ఇప్పుడు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అంగన్ వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. అలాగే అదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అంగన్ వాడీ కార్యకర్తల ఆందోళనలతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కోసం కొద్ది రోజులుగా అంగన్ వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నారు. బుధవారం కలెక్టరేట్లను ముట్టడించారు. కార్యాలయంలోకి దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అంగన్ వాడీ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులను చుట్టిముట్టి కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఆందోళన కారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. కనీస వేతనం రూ. 25వేలతోపాటు ఇతర సమస్యల పరిస్కారం కోసం సమ్మె చేస్తుంటే.. ప్రభుత్వం పట్టించుకోకపోగా పోలీసులతో అణచివేస్తోందని కార్యకర్తలు ఆరోపించారు.

## పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతం : మంత్రి కేటీఆర్



పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని మంత్రి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అంతర్జాతీయ టెక్‌పార్క్‌ను బుధవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రపంచానికి వ్యాక్సిన్లు ఉత్పత్తి చేసే స్థాయికి హైదరాబాద్ మహానగరం చేరుకుందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో 40 శాతానికి పైగా ఫార్మారంగ ఉత్పత్తులు ఇక్కడి నుంచే వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు.

హైదరాబాద్ లైఫ్‌సైన్సెస్ హబ్‌గా మారుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ చాలా అందమైన నగరమని.. ఇక్కడ టాలెంట్‌కు కొరత లేదని అన్నారు. ఇతర దేశాలతో పోలిస్తే ఇక్కడ ఖర్చు కూడా తక్కువేనని తెలిపారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ కావాలని కోరుకుంటున్నానని తెలిపారు.

## మహిళా బిల్లుతో దేశం మరింత అభివృద్ధి చెందుతుంది : మేయర్ విజయలక్ష్మి



హైదరాబాద్ : రెండు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును ఎట్టకేలకు లోక్‌సభలో ప్రవేశపెట్టడం ఎంతో సంతోషంగా ఉందని హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈ బిల్లుతో మహిళలు కూడా రాజకీయ రంగంలో ముందు ఉంటారని, దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్రను పోషిస్తారని, మహిళా సాధికారిక సాధ్యమవుతుందని అన్నారు. మహిళా బిల్లు ఆమోదం పొందటం దేశానికే గర్వకారణం అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టడంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృషి ఎంతో ఉందన్నారు. ఈ బిల్లు ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పారు. మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రధాని వ్యాఖ్యలను కేటీఆర్ వక్రీకరించారు




న్యూఢిల్లీ: తెలంగాణ సమాజం కల్వకుంట్ల కుటుంబం మాటలు నమ్మే పరిస్థితి లేదని, ప్రధాని మోదీ వ్యాఖ్యలను మంత్రి కేటీఆర్ వక్రీకరించి విమర్శిస్తున్నారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ – బీఆర్ఎస్ నేతలు ప్రధానిపై ఒకే రకమైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కాసుబ్రహ్మానంద రెడ్డి హయాంలో తెలంగాణ కోసం పోరాడిన వారిని కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, తెలంగాణలో విధ్యార్థులు, అమరవీరుల ప్రాణత్యాగాలకు కారణం సోనియా గాంధీ యేనని విమర్శించారు. గతంలో బీజేపీ కొత్త రాష్ట్రాలు ఇచ్చినప్పుడు ఎటువంటి హింసాత్మక ఘటనలు, ప్రాణత్యాగాలు జరగలేదన్నారు. తెలంగాణ ప్రకటన చేసి వెనక్కి తీసుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఆరోపించారు. తెలంగాణ వచ్చి 9.5 సంవత్సరాలు అయినప్పటికీ తెలంగాణ యువతకు ఏం చేసారో మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. కేటీఆర్, కవితలు వేల కోట్లు సంపాదించారని, రాష్ట్రంలో సారా ఏరులై పారుతోందని, ఉద్యమం సందర్భంగా యువతను రెచ్చగొట్టి ప్రాణత్యాగాలు చేయించారని, కేటీఆర్, కవితలు స్కాంలతో తెలంగాణను లూటీ చేసారని అన్నారు. తెలంగాణ సమాజానికి కల్వకుంట్ల కుటుంబం చరిత్ర మొత్తం తెలుసునని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కవిత తన తండ్రిపైనే ఇప్పటి వరకు ఒత్తిడి చేయలేదని, అలాంటిది కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కేబినెట్‌లో, శాసనసభ్యులకు ఇచ్చిన టికెట్లలో ఎంతమంది మహిళలకు అవకాశం ఇచ్చారు?.. కవిత ఈ ప్రశ్న కేసీఆర్‌ను అడగాలని ధర్మపురి అర్వింద్ అన్నారు.

## గులాబీ గూటికి రాజ్‌మాన్ సింగ్ తండా.. కాంగ్రెస్ యువజన నాయకులు

మహబూబాబాద్ : బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా పాలకుర్తి నియోజకవర్గం పెద్ద వంగర మండలం రాజ్‌మాన్ సింగ్ తండాకు చెందిన సర్పంచ్ గుగులోత్ పటేల్ నాయక్ నాయకత్వంలో కాంగ్రెస్ యువజన నాయకులు గుగులోత్ గణేశ్, గుగులోత్ యాకన్న, గుగులోత్ యాకన్నతోపాటు మరికొందరు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారికి గులాబీ కండువాలు కప్పి, బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ, నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై తాము బీఆర్ఎస్‌లో పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి విజయం కోసం కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్యా బాలకృష్ణ, గుగులోత్ సుధాకర్, గుగులోత్ నరేశ్, గుగులోత్ సుమన్, జాటోత్ సుమన్, గుగులోత్ రాజ్‌కుమార్, జాటోత్ సందీప్ ఉన్నారు.

**సీతారాంపురం గ్రామ మిత్ర యూత్ నాయకులు..** పాలకుర్తి నియోజకవర్గం, దేవరుప్పుల మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన బిజెపి యువజన నాయకులు, మిత్ర యూత్ సభ్యులు బి అర్ ఎస్ పార్టీ లో చేరారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బుధవారం వారు గులాబీ కండువాలు కప్పుకున్నారు. వారిని బిఆర్ఎస్ పార్టీలోకి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో జి. శ్రీనివాస్, డి. అఖిల్, జి. రాకెష్, సి.హెచ్. అఖిల్, జి. శ్రీకాంత్, ఏ. శ్రీకాంత్, వి. విజయ్, ఏ. నవీన్, జి. ప్రదీప్, ఏ. ప్రదీప్, ఏ. సందీప్, జి. నవీన్ దితరులు ఉన్నారు.



## కెనడాలో జాగ్రత్తగా ఉండండి..!

దిల్లీ: ఖలిస్థానీ అంశం, ట్రూడో ఆరోపణలతో భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రికత్తలు కొనసాగుతున్నాయి. తాజాగా కెనడాలోని భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. ఆ దేశంలోని పౌరులు, విద్యార్థులు, అక్కడకు ప్రయాణించాలనుకునేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. “కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, రాజకీయ అండతో జరుగుతున్న విద్వేషపూరిత నేరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు తమ ప్రయాణాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఇండియా వ్యతిరేక ఎజెండాను వ్యతిరేకిస్తున్న భారత కమ్యూనిటీ ప్రజలను, మన దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల కాలంలో బెదిరింపులు వస్తున్నాయి. అందువల్ల అలాంటి హింసాత్మక ఘటనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లొద్దని కోరుతున్నాం” అని కేంద్ర విదేశాంగ శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. “కెనడాలోని భారత పౌరులను సంరక్షించేందుకు అక్కడి అధికారులతో భారత హైకమిషన్/కాన్సులేట్ జనరల్ నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాయి. ప్రస్తుతం భద్రతా పరంగా అక్కడ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో.. పౌరులు, ముఖ్యంగా విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలి. కెనడాలోని భారత పౌరులు ఒట్టావాలోని హైకమిషన్ లేదా టొరంటో, వాంకోవర్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా వద్ద తమ పేర్లను నమోదు చేసుకోండి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు మిమ్మల్ని వేగంగా సంప్రదించేందుకు వీలవుతుంది” అని విదేశాంగ శాఖ తమ అడ్వైజరీలో సూచించింది. ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ హస్తం ఉండొచ్చని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణలు చేయడంతో ఇరు దేశాల మధ్య విభేదాలు రాజుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆ దేశంలో భారత రాయబారిపై కెనడా బహిష్కరణ వేటువేయగా, బదులుగా భారత్ ఆ దేశ రాయబారిని బహిష్కరించింది. ఈ పరిణామాల వేళ.. కెనడాలోని భారత పౌరులు, భారతీయ సంస్థలపై దాడులు జరిగే అవకాశాలున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ అడ్వైజరీ జారీ చేసింది.

## తక్షణమే రిజర్వేషన్ అమలు చేయండి.. లేదంటే డెడ్‌లైన్ పెట్టండి: ఎంపీ నామా నాగేశ్వరరావు




న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ఇప్పటి వరకు అయిదు సార్లు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినట్లు బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరావు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఇవాళ ఆయన లోక్‌సభలో మాట్లాడారు. గతంలో దేవగౌడ, వాజ్‌పేయి ప్రధానులుగా ఉన్న సమయంలో, 13వ లోక్‌సభలో మహిళా బిల్లును ప్రవేశపెట్టారని, 15వ రాజ్యసభలో ఆ బిల్లు పాసైందని, ఇప్పుడు అయిదోసారి లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నామని, ఇది మా పార్టీ విధాన నిర్ణయమన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత.. సీఎం కేసీఆర్ ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 12 రోజుల్లోనే లెజిస్లేటివ్ అసెంబ్లీలో 33 శాతం రిజర్వేషన్ మహిళలకు కల్పించేందుకు తీర్మానం చేసినట్లు గుర్తు చేశారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ సీఎం కేసీఆర్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. సర్పంచ్, జెడ్పీసీ, ఎంపీటీసీల్లో.. మహిళలకు తమ ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తోందన్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీల్లోనూ తెలంగాణ సర్కార్ మహిళలకు రిజర్వేషన్ ఇచ్చినట్లు నామా తెలిపారు. తక్షణమే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని ఎంపీ నామా డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లోనే ఆ బిల్లును అమలు చేయాలన్నారు.

లేదంటే దానికి ఓ డెడ్‌లైన్ విధించాలని కోరారు. నియోజకవర్గాల పునర్ విభజనతో పాటు రిజర్వేషన్ అమలు విషయంలో డెడ్‌లైన్ ఉండాలని బీఆర్ఎస్ ఎంపీ సూచించారు.

## నిలోఫర్ ఆస్పత్రిలో అపహరణకు గురైన బాలుడు సేఫ్!




హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో అపహరణకు గురైన ఆరు నెలల బాలుడి కథ సుఖాంతమైంది. కిడ్నాప్ అయిన చిన్నారి నిజామాబాద్‌లో క్షేమంగా ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. బాలుడిని ఎత్తుకెళ్లిన దంపతులను అదుపులోకి తీసుకున్నారు. పిల్లలు లేకపోవడంతో పెంచుకునేందుకు చిన్నారిని అపహరించినట్లు దంపతులు విచారణలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గండిపేట క్రాస్‌లోని ఓ ఫామ్‌హౌజ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సల్మాన్ ఖాన్ – ఫరీదా బేగం దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడికి అస్వస్థతగా ఉండటంతో సెప్టెంబర్ 14వ తేదీన మధ్యాహ్నం నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స కొనసాగుతుండటంతో బాబును ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. రాత్రి సమయంలో పెద్ద కుమారుడికి చికిత్స కొనసాగుతుండటంతో చిన్న కొడుకు ఫైజల్ ఖాన్‌ను పట్టుకుని తల్లి ఫరీదా బేగం మొదటి అంతస్తులో కూర్చొంది. అదే సమయంలో ఫరీదా బేగం దగ్గరకు వచ్చిన ఓ మహిళ.. ఆమెతో సన్నిహితంగా మెలిగింది. పలు అంశాలపై మాట్లాడుతూ దగ్గరైంది. ఇంతలో భోజనం తెచ్చుకునేందుకు ఫరీదా బేగం వార్డు నుంచి బయటకు వెళ్లింది. తిరిగొచ్చి చూసేసరికి చిన్న బాబు కనిపించలేదు. ఆందోళన చెందిన ఫరీదా బేగం బాబు కనిపించాడా అని చుట్టుపక్కల వాళ్లను అడగ్గా.. అప్పటివరకు ఆమెతో మాట్లాడిన మహిళే బాబును తీసుకెళ్లిందని తెలిపారు. అప్పటిదాకా ఫరీదాబేగంతో సన్నిహితంగా మెలగడంతో వాళ్ల బంధువులే అయ్యి ఉంటారని పట్టించుకోలేదని చెప్పుకొచ్చారు. వాళ్ల సమాధానంతో కంగుతిన్న ఫరీదాబేగం లబోదిబోమంటూ నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అయితే బాలుడు మిస్సయిన ట్రీట్‌మెంట్ వార్డులో సీసీ కెమెరా లేకపోవడంతో పోలీసుల దర్యాప్తునకు కొంచెం ఆటంకంగా మారింది. అయినప్పటికీ పట్టువదలకుండా కేసు దర్యాప్తు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. కిడ్నాప్ చేసిన మహిళ నిజామాబాద్‌లో ఉంటుందని గుర్తించారు.

## ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా గణేష్ నిమజ్జనాలకు ఏర్పాట్లు : మంత్రి తలసాని



హైదరాబాద్ : ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా గణేష్ నిమజ్జనాలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పీవీ మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించే గణేష్ ఉత్సవాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ సంవత్సరం సుమారు 90 వేల వరకు విగ్రహాలు ఉంటాయన్నారు.

మూడో రోజు నుంచే విగ్రహాల నిమజ్జనం ప్రారంభం అవుతుందని చెప్పారు. విగ్రహాల నిమజ్జనం కోసం పాండ్స్‌ను ఏర్పాటు చేశామని, శోభాయాత్ర మార్గాలలో నిమజ్జనం జరిగే ప్రాంతాలలో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

## మహిళలు పారిశ్రామికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్ : మహిళలు పారిశ్రామికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మహిళలు బాగుపడితేనే దసమాజం బాగుపడుతుంది. అందుకే సీఎం కేసీఆర్‌ను ఒప్పించి పైలట్ ప్రాజెక్టుగా పాలకుర్తి నియోజకవర్గంలో ఉచిత కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని, మహిళలంతా బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న పెద్దవంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల మహిళలకు తొర్రూరులో సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు పడుతున్న ఇబ్బందులు నా కళ్లారా చూసిన. అందుకే నేను కుట్టు శిక్షణ, కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాను.

5 కోట్ల 10 లక్షల రూపాయలతో ఈ కార్యక్రమాన్ని పాలకుర్తిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన. మొత్తం 10 వేల మందికి శిక్షణ ఇవ్వటం నా లక్ష్యం అన్నారు. మొదటి విడతగా 3వేల 861 మందికి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి వివరించారు. శిక్షణ పూర్తి అయిన వాళ్లకు ఈ జూలై నుంచి వరంగల్ టెక్స్‌టైల్స్ పార్క్ లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలకు వెళ్లడం ఇష్టం లేని వాళ్లకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే మీ రుణం తీర్చుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com